# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 132 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | బుధవారం 02 జులై 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 132 02-07-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-


## వాతావరణం అనుకూలించక చంద్రబాబు హెలికాప్టర్ గన్నవరంలో ల్యాండింగ్



విజయవాడ, జులై 01 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

వాతావరణం అనుకూలించక పోవడంతో సీఎం చంద్రబాబు ప్రయాణిస్తున్న హెలికాప్టర్ గన్నవరం ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అయ్యింది. గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో చంద్రబాబు రాజమహేంద్రవరం వెళ్లనున్నారు. అక్కడి నుంచి కొవ్వూరు చేరుకోనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ, ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించేందుకు తాళ్లపూడి మండలం మలకపల్లి గ్రామంలో పర్యటించనున్నారు.



## మళ్లీ దాడి జరగదని హామీ ఇస్తేనే.. చర్చలు...

### తేల్చి చెప్పిన ఇరాన్

లండన్ : ఇరాన్‌పై మరోసారి దాడులు జరగబోవని అమెరికా స్పష్టం చేస్తే తప్ప రెండు దేశాల మధ్య దౌత్య చర్చలు పునరుద్ధరించలేమని ఇరాన్ డిప్యూటీ విదేశాంగ మంత్రి మజిద్ తక్త్-రవన్చి తేల్చి చెప్పారు. ఇరాన్‌కి చెందిన మూడు అణు స్థావరాలపై దాడులు చేసిన వారం తర్వాత తాము ఇరాన్‌తో చర్చలకు సిద్ధమని అమెరికా సంకేతాలు ఇచ్చిందని అన్నారు. చర్చలు జరిగే తేదీని కానీ, చర్చలకు అనుసరించాల్సిన పద్ధతులకు కానీ ఇంతవరకు తాము

- తరువాయి 2లో..

## రాష్ట్రంలో వికాసం.. విధ్వంసం మధ్య

# యుద్ధం..!



- ఆ విధ్వంసాన్ని నా జీవితంలో చూడలేదు..
- త్వరలో నిరుద్యోగ భృతి
- సూపర్ సిక్స్ పథకాల అమలుకు కట్టుబడి ఉన్నాం
- పీ4 పథకం ద్వారా పేదరికానికి చెక్
- ప్రజా వేదికలో సీఎం చంద్రబాబు నాయుడు
- కొవ్వూరులో పెన్షన్లు పంపిణీ చేసిన సీఎం చంద్రబాబు..

కొవ్వూరు, జులై 01 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

రాష్ట్రంలో వికాసం.. విధ్వంసం మధ్య యుద్ధం జరుగుతుందని ఏపి సీఎం నారా చంద్రబాబు నాయుడు అన్నారు. నేడు తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు పర్యటనలో.. పెన్షన్లు పంపిణీ చేసిన సీఎం చంద్రబాబు.. ఆ తర్వాత ప్రజా వేదికపై మాట్లాడుతూ.. రాష్ట్రంలో వికాసం.. విధ్వంసం మధ్య యుద్ధం జరుగుతుంది. ఆర్థిక వ్యవస్థ విధ్వంసం అయ్యింది.. ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం సాధించిన అభివృద్ధి, సంక్షేమ విజయాలను ఇంటింటికి తీసుకెళ్లేందుకు కార్యాచరణ సిద్ధం చేశాం.. ఏడాది కాలంలో సాధించిన విజయాలు, సంక్షేమం, అభివృద్ధి, భవిష్యత్ కార్యాచరణతో నాంది పలికాం.. ఇంత పెద్ద మొత్తంలో ఫించన్లు ఇస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమే. డబ్బులు ఇవ్వడమే కాదు ఒకటో తేదీనే పింఛన్లు ఇంటింటికి పంపిణీ చేస్తున్నాం.. సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్ల ఇస్తున్నాం.. తల్లికి వందనం క్రింద 10 వేల కోట్ల రూపాయలు వేశాం.. ధాన్యం కొనుగోలులో కొన్ని ఇబ్బందులు

- తరువాయి 2లో..



## టెక్నాలజీతో ఎలాంటి కేసునైనా

# ఛేదించవచ్చు..

- వైఎస్ వివేకా కేసే నిదర్శనం: చంద్రబాబునాయుడు
- టెక్నాలజీతో ఏపీని నేర రహిత రాష్ట్రంగా మార్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు
- వివేకా హత్య కేసులో గూగుల్ టేకౌట్‌తో వాస్తవాలు బయటపడ్డాయని వెల్లడి
- గంజాయి, అరాచకాలకు పాల్పడితే తాటతీస్తామని తీవ్ర హెచ్చరిక
- ఏపీ పోలీస్, అమెరికా సంస్థ సంయుక్తంగా 'ఏఐ ఫర్ ఏపీ పోలీస్' హ్యాకథాన్
- సిలికాన్ వ్యాలీ తరహాలో ఏపీలో క్వాంటం వ్యాలీ ఏర్పాటు చేస్తామని ప్రకటన

అమరావతి జులై 01 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



ఆంధ్రప్రదేశ్‌ను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నేరరహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పోలీసు శాఖకు దిశానిర్దేశం చేశారు.

- తరువాయి 2లో..



## జులై 10న ఏపీలో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్


అమరావతి జులై 01 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో పారదర్శకత, తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు జూలై 10న మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, జూనియర్ కాలేజీలకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రతి విద్యా సంస్థలో ఈ సమావేశాలు నిర్దిష్ట పద్ధతిలో నిర్వహించాల్సిందిగా అధికారులను ఆదేశించింది.

**విద్యా ప్రణాళిక, మౌలిక సదుపాయాలపై చర్చ**

ఈ పేరెంట్ టీచర్ మీటింగ్‌ను ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ సమావేశాల్లో విద్యార్థుల విద్యా పురోగతిపై, బోధన

- తరువాయి 2లో..



## ఉప్పొంగుతున్న తుంగభద్ర..

- పరవళ్ళు తొక్కుతున్న శ్రీశైల డ్యాం - 74 టీఎంసీలకు నీటి నిలువలు
- 80 టీఎంసీలకు చేరగానే దిగువకు - నేడో ..రేపో విడుదలకు అవకాశం
- మరో 10 అడుగుల దూరంలో శ్రీశైలం డ్యాం - 874 అడుగులకు చేరుకున్న నీటిమట్టం

కర్ణాటక, జులై 01 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

కర్ణాటకలోని తుంగ, భద్ర, మల ప్రభకు భారీగా వరద నీరు చేరుకుంటుంది. దీంతో ఎగువ నుంచి వస్తున్న వరదనీటితో తుంగభద్ర జలాశయంనిండుకుండలా నిండుకుంది. ప్రస్తుతం తుంగభద్ర నీటిమట్టం 1633 అడుగులు కాగా, 1624.38 అడుగులకు చేరుకుంది. ఇక జలాశయ నీటి నిల్వ కెపాసిటీ 105.788 టీఎంసీలకు గాను, 74.486 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. ఎగువ తుంగ, భద్ర నుంచి 33916 క్యూసెక్కుల నీరు జలాశయంకు చేరుకుంటుంది. ఇక ఇదే సమయంలో

- తరువాయి 2లో..

## ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు బి.వి.పట్టాభిరామ్ కన్నుమూత

హైదరాబాద్ జులై 01 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, మానసిక వైద్యులు బి.వి.పట్టాభిరామ్ (75) కన్నుమూశారు. సోమవారం రాత్రి గుండెపోటుతో మరణించారు. ఆయనకు భార్య జయ, కుమారుడు ప్రశాంత్ ఉన్నారు. ఖైరతాబాద్‌లోని స్వగృహంలో పట్టాభిరామ్ భౌతికకాయాన్ని ఉంచారు. ఇంద్రజాలికుడిగా, మానసికవైద్యుడిగా, ప్రముఖ హిప్నాటిస్ట్‌గా పేరు ప్రఖ్యాతలు సంపాదించారు. బి.వి.పట్టాభిరామ్ పూర్తి పేరు భావరాజు

- తరువాయి 2లో..

## ప్రజలకు అండగా నిలబడితేనే.. లీడర్..



అమరావతి జులై 01 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

తాను రాజకీయాల్లోకి వచ్చిందే ప్రజల కోసం అని, పార్టీ స్థాపించిన నాటి నుంచి ఎన్నో ఒడిదొడుకులు ఎదురైనా తన విలువలు, విశ్వసనీయతను తాకట్టు పెట్టలేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి (%ఙీఝస్త్రుఅ%) పేర్కొన్నారు. తాడేపల్లిలో యువ వైసీపీ నాయకులతో జరిగిన సమావేశంలో జగన్ మాట్లాడుతూ, ప్రజలకు అండగా నిలబడితేనే నిజమైన నాయకుడిగా గుర్తింపు వస్తుందన్నారు. నాయకుడు అంటే కష్టాల్లో ఉన్న వారికి అండగా ఉండేవాడిగా ఉండాలని భావించాలన్నారు.

**ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన అవసరం**

రాజకీయ నాయకుడు ఎప్పటికప్పుడు ప్రజల మధ్య

- తరువాయి 2లో..



## ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా పీవీఎన్ మాధవ్ బాధ్యతలు

### మాధవ్‌కు ధృవీకరణ పత్రంను అందజేసిన ఎంపీ పాకా

### పార్టీ బాధ్యతలను అప్పగించిన పురంధేశ్వరి

విజయవాడ, జులై 01 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ ఎన్నికయ్యారు. మాధవ్‌ను ఏపీ బీజేపీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికల అబ్జర్వర్, కర్నాటక ఎంపీ పీసీ మోహన్ ప్రకటించారు. ఏపీ బీజేపీ అధ్యక్షునిగా మాధవ్‌కు ధృవీకరణ పత్రంను ఎంపీ పాకా సత్యనారాయణ, పీసీ మోహన్ అందజేశారు. బీజేపీ జెండాను మాధవ్‌కు ఇచ్చి పార్టీ బాధ్యతలను దగ్గుబాటి పురంధేశ్వరి అప్పగించారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నేడు జరిగిన ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షుడు మాధవ్‌కు పార్టీ నేతలు అందరూ శుభాకాంక్షలు తెలిపారు. కాగా, సోమవారం మధ్యాహ్నం ఏపీ బీజేపీ అధ్యక్ష పదవి నామినేషన్ల గడవు ముగిసింది. పీవీఎన్ మాధవ్ ఒక్కరే

- తరువాయి 2లో..

## శివకాశిలోని బాణసంచా కర్మాగారంలో పేలుడు..

### ఐదుగురు సజీవ దహనం

- మరికొందరికి తీవ్ర గాయాలు, ఆసుపత్రికి తరలింపు
- సహాయక చర్యలు చేపట్టిన అధికారులు
- ప్రమాద కారణాలపై దర్యాప్తు ప్రారంభం



అమరావతి జులై 01 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

తమిళనాడులోని శివకాశిలో మరో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఉదయం ఓ బాణసంచా తయారీ కర్మాగారంలో భారీ పేలుడు

- తరువాయి 2లో..

## హైకోర్టులో వైఎస్ జగన్‌కు ఊరట!

అమరావతి జులై 01 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌కు ఏపీ హైకోర్టులో తాత్కాలికంగా ఊరట లభించింది. సింగయ్య మృతి కేసులో వైఎస్ జగన్‌ను పోలీసులు విచారించకుండా.. న్యాయస్థానం స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణ ను హైకోర్టు రెండు వారాలకు వాయిదా వేసింది. కౌంటర్ దాఖలుకు ఏజీ 2 వారాల గడువు కోరగా.. విచారణను 2 వారాలకు వాయిదా వేసింది. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల పర్యటనకు వైఎస్ జగన్ వెళ్తుండగా.. వైసీపీ కార్యకర్త సింగయ్య ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. జగన్ కాన్వాయ్ కారణంగానే సింగయ్య మృతి చెందాడని నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టేయాలంటూ జగన్‌తో పాటు పలువురు నేతలు క్వాష్ పిటిషన్లు వేశారు. వాటన్నింటిని హైకోర్టు విచారణ జరుపుతోంది. ఈరోజు కేసు విచారణపై తదుపరి చర్యలు నిలిపివేస్తూ ఏపీ హైకోర్టు స్టే విధించింది. కేసు విచారణ లో పురోగతి ఏం ఉందని న్యాయమూర్తి ఏజీని ప్రశ్నించింది.

# సంపాదకీయం

## కర్ణాటక కాంగ్రెస్‌లో మళ్లీ అసమ్మతి!

కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పుపై మరోసారి ఊహాగానాలు ఊపందుకున్నాయి. విజయదశమి నాటికి అధికార కాంగ్రెస్ పార్టీలో ముఖ్యమంత్రి పీఠంతోపాటు పిసిసి అధ్యక్ష స్థానం, మంత్రివర్గంలో మార్పులు చోటుచేసుకుంటాయని గత కొద్ది రోజులుగా కాంగ్రెస్ అసమ్మతి నేతలు బహిరంగంగానే ప్రకటనలు చేస్తున్నారు. అయితే అధికార మార్పిడి ఉండబోదని, సిద్ధరామయ్యే పూర్తికాలం పదవిలో కొనసాగుతారని ఆయన వర్గం నేతలు ధీమాగా ఉన్నారు. ఒకవేళ ముఖ్యమంత్రి స్థానాన్ని ఉపముఖ్యమంత్రి డికె శివకుమార్‌కు వదిలి పెట్టాల్సిన పరిస్థితి వస్తే పిసిసి అధ్యక్ష పదవిని తనకు చిరకాలంగా మద్దతు ఇస్తూ వస్తున్న మంత్రి సతీశ్ జారి?హొళికి కట్టబెట్టాలని సిద్ధరామయ్య పార్టీ అధిష్ఠానాన్ని కోరినట్లు సమాచారం.

మరోవైపు కర్ణాటకలో అధికార మార్పిడి గురించి సోమవారం విలేఖరులు అడిగిన ప్రశ్నకు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పందిస్తూ, అంతా పార్టీ అధిష్ఠానవర్గం చేతుల్లో ఉందని వ్యాఖ్యానించడం గమనార్హం. ఈ విషయంపై ప్రతిపక్ష బిజెపి నేత తేజస్వి సూర్య స్పందిస్తూ కాంగ్రెస్ పార్టీలో అధిష్ఠానవర్గం అనేది దయ్యం లాంటిదని, అది ఎవరికీ కనిపించదు, వినిపించదని ఎద్దేవా చేశారు. పార్టీకి అధ్యక్షుడు అధిష్ఠానం కానప్పుడు మరెవరని కూడా ఆయన ఎదురుప్రశ్న వేశారు. మరోవైపు రాష్ట్ర కాంగ్రెస్‌లో (%ఖ్ఫ్వ జశీఅఠ్రీవం౦%) ఎలాంటి లుకలుకలు లేవని, తాను, శివకుమార్‌లు కలిసి బాగానే పని చేస్తున్నామని చెప్పడానికి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రయత్నిస్తున్నారు. సోమవారం మైసూరులో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఇరువురు నేతలు చేతులు పట్టుకుని పైకెత్తి తాము కలిసే ఉన్నామని చెప్పే ప్రయత్నం చేశారు.

అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటినుంచీ ఇరువురు నేతలు కలిసి ఉన్నట్లు పైకి కనిపించినా ఇద్దరి మధ్య దూరం కొనసాగుతూనే ఉందనేది పార్టీ వర్గాల అభిప్రాయం. వాస్తవానికి 2023లో కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించినప్పటినుంచి కూడా ముఖ్యమంత్రి పీఠంపై వివాదం కొనసాగుతూనే ఉంది. సిఎం పదవికోసం సిద్ధరామయ్యతో పాటు శివకుమార్ కూడా గట్టిగానే ప్రయత్నించారు. ఇరువురూ చెరి రెండున్నరేళ్లు సిఎం పదవి చేపట్టేలా ఒప్పందం కుదిరినట్లు అప్పట్లో పెద్ద ఎత్తున ప్రచారం కూడా జరిగింది. అయితే దీనిపై అటు పార్టీ అధిష్ఠానం కానీ, ఇటు సిద్ధరామయ్య, శివకుమార్‌లు కానీ ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. రాష్ట్రంలో సిద్ధరామయ్య ముఖ్యమంత్రి పదవి చేపట్టి రెండేళ్లు పూర్తి కావస్తుండడంతో ఇప్పుడు మరోసారి నాయకత్వం మార్పుపై ఊహాగానాలు మొదలయ్యాయి.

వాస్తవానికి ముడా స్కామ్, వాల్మీకి కార్పొరేషన్ కుంభకోణం వెలుగులోకి వచ్చినప్పటినుంచి సిద్ధరామయ్య ముఖ్యమంత్రి పదవినుంచి తప్పుకోవాలని అటు ప్రతిపక్ష బిజెపితో పాటుగా ఇటు కాంగ్రెస్‌లోని అసమ్మతి నేతలు డిమాండ్ చేస్తూనే ఉన్నారు. అంతేకాదు, సిద్ధరామయ్య తప్పుకోకపోతే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ రెండుగా చీలిపోతుందని అప్పుడు 'సందట్లో సడేమియా'గా తాము అధికారంలోకి రావచ్చని కాషాయ నేతలు భావిస్తున్నారని, కాంగ్రెస్‌లో అసమ్మతి కుంపట్ల వెనుక ఆ పార్టీ హస్తముందన్న విమర్శలు కూడా ఉన్నాయి. అధికారంలోకి రావడంకోసం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడానికి ఖాళీ ఖజానా పెద్ద అడ్డంకిగా మారడంతో సిద్ధరామయ్య సర్కార్‌పై ప్రజల్లో అసహనం మొదలైంది. దీనికి తోడు నిధులు లేకపోవడం, ఎక్కడికక్కడ అభివృద్ధి కార్యక్రమాలు ఆగిపోవడంతో అధికార పార్టీ నేతల్లో సైతం అసంతృప్తి ఉంది. ఈ తరుణంలో మళ్లీ పార్టీలో అసమ్మతి గళం బలంగా వినిపించడం మొదలైంది.

డిప్యూటీ సిఎం శివకుమార్ రెండు, మూడు నెలల్లో ముఖ్యమంత్రి అవుతారంటూ ఆయనకు సన్నిహితుడైన కాంగ్రెస్ ఎంఎల్ఎ ఇక్బాల్ హుస్సేన్ రెండు రోజుల క్రితం సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ఏడాది చివర్లోగా కర్ణాటకలో నాయకత్వ మార్పు చేయాలని అధిష్ఠానం భావిస్తోందనే ఊహాగానాలు వినిపిస్తున్న తరుణంలో ఇక్బాల్ కామెంట్స్ రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ఎవరు చెమటోడ్చారో అందరికీ తెలుసునని కూడా ఆయన వ్యాఖ్యానించడం గమనార్హం. తాను దాపరికపు మాటలు చెప్పనని, వాస్తవాలే చెప్తున్నానని ఆయన చేసిన వ్యాఖ్యలతో పరిస్థితి చేయిదాటేలా ఉందని కాంగ్రెస్ అధిష్ఠానం కూడా భావించినట్లు కనిపిస్తోంది.

కర్ణాటక పార్టీ వ్యవహారాల ఇంచార్జి, పార్టీ ప్రధాన కార్యదర్శి రణదీప్ సింగ్ సుర్జేవాలాను హుటాహుటిన బెంగళూరుకు పంపించింది. మూడు రోజులపాటు రాష్ట్రంలోనే ఉండనున్న ఆయన అసమ్మతి ఎంఎల్ఎలందరితో ముఖాముఖి మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకుంటారని, ఆ తర్వాత అధిష్ఠానానికి ఆయన అందించే నివేదికపై సిద్ధరామయ్య భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఏదిఏమైనా కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం పరిస్థితి మొదటినుంచీ కలహాల కాపురంగానే ఉండడం గమనార్హం. పార్టీ అధికారంలో ఉన్న మూడు రాష్ట్రాల్లో అత్యంత కీలకమైన కర్ణాటకలో పరిస్థితితో కాంగ్రెస్ అధిష్ఠానానికి కూడా తల బొప్పి కడుతోంది.

## మళ్లీ దాడి జరగదని హామీ ఇస్తేనే.. చర్చలు...

అంగీకరించలేదని మజిద్ తెలిపారు. తమ ప్రశ్నకు ముందు సమాధానం రావాలని, అప్పుడే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. చర్చలు జరుపుతున్నప్పుడు మళ్లీ ఇటువంటి దురాక్రమణ చర్యలు పునరావృతమవుతాయా అని ఆయన ప్రశ్నించారు. కీలకమైన ఈ ప్రశ్నకు అమెరికా స్పష్టమైన సమాధానం చెప్పాల్సి వుందన్నారు. యురేనియంను శుద్ధి చేసుకోవడానికి ఇరాన్‌ను అనుమతించాల్సిందేనని అన్నారు. ఏ స్థాయి, సామర్థ్యాల వరకు అనుమతించాలనేది కావాలంటే చర్చించుకోవచ్చన్నారు. యురేనియం శుద్ధి ఆపడానికి అంగీకరించకపోతే బాంబులువేస్తాం అనేది ఆటవిక న్యాయమని అన్నారు. ఈ నెల ఆరంభంలో ఇరాన్ అణు కార్యక్రమంపై అమెరికా, ఇరాన్ చర్చలు జరుపుతుండగా ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఇజ్రాయిల్, ఇరాన్‌పై దాడులకు దిగింది. ఈ నెల 21న అమెరికా, ఇరాన్‌కి చెందిన మూడు అణు కేంద్రాలపై దాడులు చేసింది.

**ఇరాన్ మృతులు 935**

ఇజ్రాయిల్‌తో జరిగిన యుద్ధంలో మరణించిన వారి సంఖ్య 935 అని ఇరాన్ సోమవారం అధికారికంగా ప్రకటించింది. వీరిలో సామాన్యపౌరులు ఎంతమంది, సైనికులు ఎంతమంది అన్న వివరాలను ప్రభుత్వ వార్తా సంస్థ ఇర్నా వెల్లడించలేదు. మరణించిన వారిలో 132మంది మహిళలు, 38మంది చిన్నారులు వున్నారని తెలిపింది.

**మీడియా వార్తలను కొట్టిపారేసిన ట్రంప్**

ఇరాన్‌తో తాను మాట్లాడలేదని, ఆ దేశానికి సాయం చేస్తానని చెప్పలేదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పష్టం చేశారు. ఆ మేరకు వస్తున్న మీడియా వార్తలను ఆయన తోసిపుచ్చారు. ఖమేనీపై ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై కూడా ఇరాన్ దీటుగానే స్పందించింది. డాడీ వద్దకు పరుగులు పెట్టడం తప్ప ఇజ్రాయిల్‌కు మరో మార్గం లేదని వ్యాఖ్యానించింది.

## రాష్ట్రంలో వికాసం.. విధ్వంసం యుద్ధం..!

వచ్చిన తరువాత కూడా రైతుల ఖాతాలో డబ్బులు.. ఆగస్టు 15వ తేదీన మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించబోతున్నాం అని వెల్లడించారు. పింఛన్లు సక్రమంగా అందించాలనే ఉద్దేశంతో నేనే నేరుగా గ్రామాలకు వచ్చి పంపిణీ చేస్తున్నాను%ొ% పేద వాడిని చిన్న చూపు చూస్తే సహించను అని ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు హెచ్చరించారు. నేను కష్టపడుతుంది పేదల కళ్లల్లో ఆనందం కోసం.. అర్హులందరికీ ఫించన్లు మంజూరు చేస్తా అని హామీ ఇచ్చారు.. గత ప్రభుత్వంలో పింఛన్లు వైసీపీ కార్యకర్తలకు ఇచ్చారని విమర్శించారు.. ఇక, ఎవరైనా డ్రగ్స్, గంజాయి వాడిన
వారిని తాట తీస్తాం అని హెచ్చరించారు. డ్రగ్స్ కు బానిసలై తల్లికి,చెల్లికి, పెళ్లానికీ తేడా లేకుండా అత్యాచారాలకు పాల్పడుతున్నారు.. ఓ ఆడపిల్ల పైన అయిన చేయి వేస్తే అదే చివరి రోజు అవుతుందని వార్నింగ్ ఇచ్చారు సీఎం చంద్రబాబు. ఇక, నేను, ప్రధాని మోడీ, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అందరం సాధారణ కుటుంబంలో పుట్టిన వారమే.. లక్ష కుటుంబాలను దత్తత తీసుకున్న, పది వేల మార్గదర్శకులు ముందుకు వచ్చారని తెలిపారు చంద్రబాబు.. రాష్ట్రానికీ పది లక్షల కోట్లు అప్పులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో పోలవరం విధ్వంసం అయ్యింది.. డయఫ్రం వాల్ దెబ్బతిని నిర్మాణం జరగలేదు. కానీ, గడిచిన ఏడాదిలో పోలవరం ప్రాజెక్టు పనులు 6 శాతం పూర్తి చేశాం.. ఇప్పటికీ. 82 శాతం పనులు పూర్తి అయ్యాయి.. పోలవరం ప్రాజెక్టును 2027కి పూర్తి చేస్తాం అని ఆయన హామీ ఇచ్చారు. రాజకీయాలకు రౌడీలు వస్తున్నారు.. రౌడీలే రాజ్యమేలే పరిస్థితికి చేరారు అని చంద్రబాబు మండిపడ్డారు. వైఎస్ వివేకానంద హత్య కేసులో నన్ను మోసం చేశారు.. పోస్టుమార్టం కూడా చేయకుండా అంత్యక్రియలు చేయడానికీ ప్రయత్నించారు.. గుండెపోటు అని నమ్మించారు.. పోస్టుమార్టం చేస్తే గుండెపోటు కాదు కత్తి పోటు అని తేలిందని గుర్తుచేశారు.. రాష్ట్రంలో నేను రౌడీలతో పోరాటం చేస్తున్నా.. పెళ్లి చేసే ముందు ఏడు తరాలు వెనుకకు చూడటమే కాకుండా పుట్టు మచ్చలు సైతం చూస్తున్నారు.. కానీ, ఓటు వేసే ముందు ఇవేవి చూడకుండా వేస్తున్నారు అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు సీఎం చంద్రబాబు..

**త్వరలో నిరుద్యోగ భృతి**

ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి దిశగా నడిపిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. యువత కోసం త్వరలోనే నిరుద్యోగ భృతి పథకాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఈ పథకం ద్వారా ఉద్యోగం లేని అర్హులైన యువతకు నెల నెలకు ఆర్థిక సహాయం అందించబోతున్నట్టు చెప్పారు. ఇది రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తగ్గించడంలో సహాయపడుతుందని ఆయన తెలిపారు.

**సూపర్ సిక్స్ పథకాల అమలుకు కట్టుబడి ఉన్నాం**

ప్రజల సంక్షేమం కోసం తెదేపా-జనసేన-బీజేపీ కూటమి ప్రతిపాదించిన సూపర్ సిక్స్ పథకాలు పక్కాగా అమలు చేస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. "తల్లికి వందనం" కార్యక్రమానికి రూ.10,000 కోట్లు కేటాయించామని, వచ్చే నెల 15 నుంచి మహిళల కోసం ఉచిత బస్ ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఈ పథకాలన్నీ సామాన్య ప్రజలకు ప్రయోజనం చేకూర్చేలా రూపొందించబడ్డాయని చెప్పారు.

**పీ4 పథకం ద్వారా పేదరికానికి చెక్**

చంద్రబాబు పేర్కొన్న మరో ముఖ్యాంశం పీ4 పథకం. ఇది %-% "ప్రజల అవసరాల కోసం, పౌరుల భాగస్వామ్యంతో, పరిష్కారోన్నత పాలన" అనే ధ్యేయంతో రూపొందించబడినది. ఈ పథకం ద్వారా సమాజంలో పేదరికాన్ని నిర్మూలించడం, అన్ని వర్గాల అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకోవడం ముఖ్య ఉద్దేశమని సీఎం తెలిపారు. రాష్ట్రాన్ని విధ్వంసం నుంచి వికాసం వైపు తీసుకెళ్లేందుకు తన ప్రభుత్వం నడుం బిగించిందని పేర్కొన్నారు.

## టెక్నాలజీతో ఎలాంటి కేసునైనా ఛేదించవచ్చు..

సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి క్లిష్టమైన కేసులను సైతం ఎలా ఛేదించవచ్చో వివేకానంద రెడ్డి హత్య కేసే నిరూపిస్తుందని ఆయన స్పష్టం చేశారు. మంగళగిరిలో నిర్వహించిన 'ఏఐ ఫర్ ఏపీ పోలీస్-హ్యాకథాన్-2025' కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నా ఆయన, శాంతిభద్రతలు అదుపులో ఉంటేనే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తాయని, అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.

**గూగుల్ టేకౌట్‌తో బయటపడ్డ నిజాలు**

గత ప్రభుత్వం తనపై చేసిన ఆరోపణలను ఈ సందర్భంగా చంద్రబాబు తిప్పికొట్టారు. "వివేకా హత్య కేసులో నాపై బురద చల్లాలని చూశారు. నారాసుర రక్త చరిత్ర అంటూ దారుణంగా విమర్శించారు. కానీ, సీబీఐ దర్యాప్తులో గూగుల్ టేకౌట్ వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడటంతోనే అసలు నిజాలు వెలుగులోకి వచ్చాయి" అని ఆయన గుర్తు చేశారు. తప్పులు చేసి, వాటిని కప్పిపుచ్చుకోవడానికి ప్రయత్నించే వారి ఆటలు ఇక సాగవని, సాంకేతిక పరిజ్ఞానంతో అలాంటి వారిని సులభంగా పట్టుకోవచ్చని అన్నారు. ఇటీవల తెనాలిలో మాజీ ముఖ్యమంత్రి రౌడీ షీటర్లకు సంఘీభావం తెలపడాన్ని, పల్నాడు జిల్లా పర్యటనలో జరిగిన ఘటనలను ఆయన ప్రస్తావిస్తూ విమర్శించారు.

**అరాచకాలు చేస్తే తాటతీస్తాం**

రాష్ట్రంలో నేరాలకు పాల్పడే వారిని కఠినంగా అణచివేస్తామని చంద్రబాబు హెచ్చరించారు. "ఇష్టానుసారంగా గంజాయి అమ్మడం, పండించడం, సేవించడం వంటివి చేస్తే సహించేది లేదు. ఆడబిడ్డల జోలికి వస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదు. అత్యాచారాలు, అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు" అని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. డ్రోన్లు, సీసీటీవీ కెమెరాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా నిఘా పెంచుతామని, తప్పు చేసిన వారిని ఆధారాలతో సహా పట్టుకుంటామని స్పష్టం చేశారు.

**క్వాంటం వ్యాలీతో తెలుగు వారి సత్తా**

రాష్ట్ర యువత సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ప్రపంచస్థాయిలో రాణించాలని చంద్రబాబు ఆకాంక్షించారు. "గతంలో ఐటీని ప్రోత్సహించాం. ఇప్పుడు క్వాంటం వ్యాలీ ద్వారా తెలుగు వారి సత్తాను ప్రపంచానికి చాటబోతున్నాం. అమెరికాలో సిలికాన్ వ్యాలీ ఎలాగో, ఇక్కడ క్వాంటం వ్యాలీ అలా ఉండాలి" అని ఆయన తన దార్శనికతను వివరించారు. 'స్థానికంగా పనిచేస్తూ, ప్రపంచస్థాయిలో ఆలోచించాలి' అనే నినాదంతో ముందుకు సాగాలని యువతకు పిలుపునిచ్చారు. నేరాల నియంత్రణ, వేగవంతమైన దర్యాప్తు కోసం ఏపీ పోలీస్ విభాగం, అమెరికాకు చెందిన '4 సైట్ ఏఐ' సంస్థలు సంయుక్తంగా ఈ హ్యాకథాన్‌ను నిర్వహించాయి. ఇందులో 160కి పైగా బృందాలు పాల్గొన్నాయి. ముఖ్యమంత్రి ఈ బృందాలతో ముచ్చటించి, వారి ఆలోచనలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## జులై 10న ఏపీలో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్

ప్రమాణాలపై, మౌలిక సదుపాయాల అవసరాలపై తల్లిదండ్రులకు వివరణ ఇవ్వనున్నారు. అలాగే ప్రతి విద్యా సంస్థ తమ కార్యాచరణ ప్రణాళిక, లక్ష్యాలు, అమలవుతున్న పథకాలపై వివరాలను తెలియజేస్తుంది. తల్లిదండ్రుల నుంచి ఫీడ్‌బ్యాక్ సేకరించడం ద్వారా విద్యా ప్రమాణాలు మెరుగుపర్చే లక్ష్యం వహిస్తోంది.

**పిల్లల మానసిక ఆరోగ్యం, ఆటల పోటీలు ప్రత్యేక ఆకర్షణ**

ఈ కార్యక్రమంలో పిల్లల మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక సెషన్లు నిర్వహించనున్నారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సానుకూల దృక్పథాన్ని పెంపొందించేలా చర్చలు, సలహాలు ఇవ్వనున్నారు. అదేవిధంగా, విద్యార్థులకు ఉత్సాహాన్ని కలిగించే ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు. తల్లిదండ్రుల భాగస్వామ్యంతో విద్యార్థుల భవిష్యత్‌కు మరింత బలమైన పునాది వేయాలన్నదే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం.

## ఉప్పొంగుతున్న తుంగభద్ర..

జలాశయం నుంచి 2389 క్యూసెక్కుల నీరు కాలువలకు వెళ్తుంది.

**శ్రీశైల జలాశయంకు వరద జోరు%ొ**

%కర్ణాటక, మహారాష్ట్ర ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో శ్రీశైలంకు వరద పోటెత్తుతుంది. ముఖ్యంగా కృష్ణమ్మ పరవళ్ళు తొక్కుతుంది. జూరాల నుంచి విడుదలవుతున్న నీరు నేరుగా శ్రీశైలం చేరుకుంటుంది. ఈ క్రమంలో శ్రీశైల జలాశయ నీటిమట్టం 885 అడుగులకు గానూ 874.30 అడుగులకు చేరుకుంది. ఇక జలాశయంలో 215.8070 టీఎంసీలకు గానూ 160.5282 టీఎంసీలకు చేరుకుంది. ఇక ఇదే సమయంలో జూరాల నుంచి డ్యామ్ లోకి 1,00,085 క్యూసెక్కుల నీరు చేరుతుంది. ఇందులో జూరాల పవర్ హౌస్ నుంచి 26,072 క్యూసెక్కులు, స్పిల్ వే నుంచి 74,029 క్యూసెక్కుల నీరు విడుదలవుతుంది. ఆ నీరు నేరుగా శ్రీశైల జలాశయంకు చేరుకుంటుంది. ఇక శ్రీశైల జలాశయం నుంచి 58,750 క్యూసెక్కుల నీరు పవర్ ఉత్పత్తి ఇతర వాటికి విడుదలవుతుంది. ఇందులో ఏపీ పరిధిలోని కుడి విద్యుత్ కేంద్రం నుంచి 11,061 క్యూసెక్కుల నీటిని వినియోగించి%ొ% 6.068 మెగా యూనిట్లు, విద్యుత్ ఉత్పత్తిని చేస్తున్నారు. ఇక తెలంగాణ పరిధిలోని ఎడమ విద్యుత్ కేంద్రం నుంచి 19,031క్యూసెక్కుల నీటిని వినియోగించి 9.504 మెగా యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. మొత్తంగా శ్రీశైలం డ్యాం నుంచి 30,276 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలవుతుంది.

## ప్రజలకు అండగా నిలబడితేనే.. లీడర్..

ఉండాలని జగన్ హితవు పలికారు. ప్రజల సమస్యలు తెలుసుకోవడమే కాదు, వాటికి తగిన పరిష్కార మార్గాలు చూపడం నాయకత్వ లక్షణమని తెలిపారు. యువ నాయకులు ప్రజలతో నిత్యం మమేకమై ఉండాలని సూచించారు. ప్రభుత్వ అవినీతి, వైఫల్యాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి నాయకుడూ బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని చెప్పారు.

**సోషల్ మీడియాలో యువత పాత్ర కీలకం**

జగన్ మాట్లాడుతూ, ప్రభుత్వ అన్యాయాలను, దుర్వినియోగాలను సామాజిక మాధ్యమాల (%ూశీఛిఱaశ్రీ వీవఎఱa%) ద్వారా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. "మీరు చేసే ప్రతి పోస్ట్, ప్రతి వీడియో, ప్రతి సందేశం ప్రజలకు నిజం తెలియజేసే ఆయుధంలా పనిచేస్తుంది," అని జగన్ పేర్కొన్నారు. నిజాన్ని ప్రచారం చేయడంలో యువత పాత్ర అత్యంత కీలకమని, ప్రజాస్వామ్య పరిరక్షణలో యువ నాయకత్వం కీలకంగా మారాలని ఆకాంక్షించారు.

## ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు బి.వి.పట్టాభిరామ్ కన్నుమూత

వేంకట పట్టాభిరామ్. ఆయన స్వస్థలం తూర్పుగోదావరి జిల్లా. పట్టాభిరామ్ రచయిత, వ్యక్తిత్వ వికాస నిపుణుడు, హిప్నాటిస్టు, మెజీషియన్. తెలుగు, ఇంగ్లీషు, కన్నడ, తమిళ భాషల్లో పలు రచనలు చేశారు. ఆయన విద్యార్థుల కోసం ప్రత్యేక శిక్షణా తరగతులను నిర్వహించడంతో పాటు తల్లిదండ్రులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. దూరదర్శన్‌లో అనేక మేజిక్ షోలు ప్రసారమయ్యాయి. 1990లలో పలు పత్రికలో 'బాలలకు బంగారుబాట' అనే శీర్షికలో అనేక మంది ప్రపంచ ప్రముఖుల జీవితచరిత్రల గురించి వ్యాసాలు రాశారు. బాలజ్యోతి అనే బాలల పత్రికలో 'మాయావిజ్ఞానం' పేరిట వ్యాసాలు రాశారు.

## ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా పీవీఎన్ మాధవ్ బాధ్యతలు

నామినేషన్ దాఖలు చేశారు. ఒకే నామినేషన్ వేయడంతో.. ఏపీ బీజేపీ చీఫ్ పేరు నిన్ననే ఖరారు అయింది. ఈరోజు అధికారికంగా ప్రకటించారు. పీవీఎన్ మాధవ్‌కు బీజేపీ, దాని అనుబంధ సంస్థల్లో పనిచేసిన అనుభవం ఉంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న మాధవ్.. గతంలో శాసన మండలిలో బీజేపీ ఫ్లోర్ లీడర్‌గా పనిచేశారు. ఆర్ఎస్ఎస్, బీజేవైఎంలో ఆయన బాధ్యతలు నిర్వర్తించారు. పీవీఎన్ మాధవ్ పూర్తి పేరు పోకల వంశీ నాగేంద్ర మాధవ్. 1973 ఆగస్టు 10న విశాఖపట్నంలోని మద్దిలపాలెంలో జన్మించారు. బీజేపీ సీనియర్ నేత, దివంగత చలపతిరావు కుమారుడే మాధవ్. చలపతిరావు రెండుసార్లు ఎమ్మెల్సీగా పనిచేశారు. నిన్నటివరకు ఏపీ బీజేపీ అధ్యక్షురాలిగా దగ్గుబాటి పురంధేశ్వరి ఉన్న విషయం తెలిసిందే.

## శివకాశిలోని బాణసంచా కర్మాగారంలో పేలుడు..



సంభవించింది. ఈ దుర్ఘటనలో నలుగురు కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. దేశవ్యాప్తంగా టపాసుల తయారీకి కేంద్రంగా ఉన్న శివకాశిలోని ఓ ప్రైవేట్ ఫ్యాక్టరీలో కార్మికులు విధుల్లో నిమగ్నమై ఉండగా ఈ ప్రమాదం జరిగింది. ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు సంభవించడంతో ఫ్యాక్టరీ ప్రాంగణంలో దట్టమైన పొగ, మంటలు అలుముకున్నాయి. ఏం జరిగిందో తెలుసుకునే లోపే నలుగురు కార్మికులు మంటల్లో చిక్కుకుని సజీవ దహనమయ్యారు. మరికొందరు కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. దీంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రస్తుతానికి ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు తెలియరాలేదు. షార్ట్ సర్క్యూట్ లేదా రసాయనాల మిశ్రమంలో జరిగిన పొరపాటు వల్ల పేలుడు జరిగి ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. అధికారులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. శివకాశిలో తరచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతుండటం స్థానికంగా తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

తెలుగురాష్ట్రం దినపత్రిక

# జనరల్ న్యూస్

https://epaper.teluguraastram.com

అమలాపురం జులై 02, బుధవారం 2025



## ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేష్

# 66వ రోజు ప్రజాదర్బార్‌లో ప్రజల విజ్ఞప్తులు

- కూటమి ప్రభుత్వంలో అందరికీ అండగా ఉంటామని మంత్రి లోకేష్ భరోసా
- మెడికల్ సీటు ఇప్పిస్తామంటూ సజ్జల సన్నిహితుడు మోసం చేశాడు
- ప్రాణాంతక జన్యువ్యాధితో బాధపడుతున్న 9 నెలల చిన్నారిని కాపాడండి

**ఉండవల్లి, జులై 01 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆపద ఏదైనా ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తున్న విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ మంగళవారం ఉదయం ఉండవల్లి నివాసంలో 66వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. వివిధ సమస్యలతో బాధపడుతున్న వారు స్వయంగా మంత్రి నారా లోకేష్ ను కలిసి విన్నవించారు. ప్రతిఒక్కరి అర్జీ పరిశీలించిన మంత్రి.. ఆయా సమస్యల పరిష్కారం కోసం అప్పటికప్పుడే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కూటమి ప్రభుత్వం ప్రతిఒక్కరికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన విజ్ఞప్తులుమెడికల్ సీటు ఇప్పిస్తామంటూ సజ్జల సన్నిహితుడు మోసం చేశాడు – తమ కుమారుడికి పీజీ మెడికల్ సీటు ఇప్పిస్తామంటూ అప్పటి వైసీపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అండతో తూర్పు గోదావరి జిల్లా కొత్తపేట, వాడపాలెంకు చెందిన సజ్జల సన్నిహితుడు అడపా ప్రేమ్ చంద్, గుత్తుల అవినాష్, కట్టెవాటి బాలిరెడ్డి రూ.1.20 కోట్లు తీసుకుని మోసం చేశారని, విచారించి తగిన న్యాయం చేయాలని గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కుంచనపల్లికి చెందిన మన్నె సుబ్బారావు మంత్రి నారా లోకేష్ ను కలిసి ఫిర్యాదు చేశారు. తాను మెడికల్ సీటు గురించి ప్రశ్నించగా.. అప్పటి సీఎంవో అధికారి ధనుంజయరెడ్డి ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీలో సీటు ఇప్పిస్తానంటూ రెండు కోట్లు డిమాండ్ చేశారు. అంత సొమ్ము చెల్లించలేమని చెప్పడంతో తాము కట్టిన నగదుకు బెంగుళూరులోని రామయ్య మెడికల్ కాలేజీలో సీటు ఇప్పిస్తామంటూ తీసుకెళ్లి సీట్ అలాట్ మెంట్ కు సంబంధించి నకిలీ లేఖను చేతిలో పెట్టి మోసం చేశారు. నగదును తిరిగి ఇవ్వాలని కోరగా సజ్జల పేరుచెప్పి బెదిరిస్తున్నారు. తప్పుడు పత్రాలతో తమను మోసం చేశారని, తమకు రావాల్సిన నగదును తిరిగి ఇప్పించాలని మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. – మంగళగిరి నియోజకవర్గం కంతేరులో తమ కుటుంబానికి చెందిన 0.70 ఎకరాల వ్యవసాయ భూమిని ఐదేళ్ళ క్రితం విక్రయించామని, అయితే పొలం విక్రయం తాలూకా బాకీ ఉన్న రూ.12 లక్షల నగదు ఇవ్వకుండా గ్రామానికి చెందిన విష్ణు, రాము తమపై దౌర్జన్యానికి దిగుతున్నారని ఉండవల్లికి చెందిన కల్లం విజయలక్ష్మి మంత్రి నారా లోకేష్ ను కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి ఆధారం లేని తమకు తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. – ఎస్ఎంఏ(స్పైనల్ మస్క్యులర్ అట్రోపీ) అనే ప్రాణాంతక జన్యు వ్యాధితో బాధపడుతున్న తమ 9 నెలల బాలుడికి వైద్యసాయం అందించి చిన్నారి ప్రాణాలు కాపాడాలంటూ ఎన్టీఆర్ జిల్లా విసన్నపేట మండలం పుట్రేల గ్రామానికి చెందిన జొన్నాడ సాయిరామ్ విజ్ఞప్తి చేశారు. ప్రతి 10వేల మందిలో ఎకరు ఎస్ఎంఏతో జన్మిస్తారని, ప్రపంచంలో ఖరీదైన జోల్ జెన్ స్మా(%ఓశీశ్రీస్త్రవఅంఝు%) మందు ఒక్కటే నివారణ అని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. కోట్ల ఖరీదు చేసే ఇంజక్షన్ అయినందున సామాన్య మధ్యతరగతి కుటుంబానికి చెందిన తమకు ఆ ఇంజక్షన్ కొనుగోలు చేసే ఆర్థికస్థోమత లేదని కన్నీటిపర్యంతమయ్యారు. ప్రభుత్వం తరపున వైద్యసాయం అందించి తమ చిన్నారిని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు. – తెలుగుదేశం పార్టీ సానుభూతిపరుడినైన తనను వైసీపీ ప్రభుత్వ హయాంలో లేటి సుధీర్, గంధం ప్రసన్నాంజనేయులు, వైసీపీ కౌన్సిలర్ తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని, తన ఇంటిని కూల్చడంతో పాటు తన 2.50 ఎకరాల వ్యవసాయ భూమి విషయంలో ఇబ్బందులకు గురిచేస్తున్నారని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా జలదంకి మండలం, తిమ్మసముద్రానికి చెందిన తోటకూర వెంకట సురేష్ మంత్రి నారా లోకేష్ ను కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. తనకు నష్టపరిహారం చెల్లించడంతో పాటు వ్యవసాయ భూమికి పట్టా ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. – పల్నాడు జిల్లాలోని బిషప్స్, పాస్టర్స్, క్రైస్తవ సంఘాలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని పల్నాడు డిస్ట్రిక్ట్ పాస్టర్స్ ఫెలోషిప్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. పాస్టర్స్ అందరికీ ప్రభుత్వం నుంచి మ్యారేజీ లైసెన్స్ లు మంజూరుచేయడంతో పాటు పల్నాడు జిల్లాలోని అర్హులైన దైవ సేవకులకు ప్రతి నెల రూ.5వేలు గౌరవ వేతనం మంజూరుచేయాలని కోరారు. చర్చి స్థలాలకు ధృవీకరణ పత్రం, చర్చిల నిర్మాణం, మరమ్మతులకు నిధులు కేటాయించాలన్నారు. క్రిష్టియన్ కమ్యూనిటీ హాల్స్ ను నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు. – ఇంజనీరింగ్ చదివిన తనకు అర్హతకు తగిన ఉద్యోగ అవకాశం కల్పించాలని విజయవాడ




విద్యాధరపురానికి చెందిన బి.చంద్రలేఖ మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. – సాక్షర భారత్(వయోజన విద్య) కార్యక్రమంలో సుమారు 9 ఏళ్ల నుంచి పనిచేసి నిరక్షరాస్యత నిర్మూలనతో పాటు అనేక ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొని గ్రామాల అభివృద్ధికి కారణమైన సుమారు 1840 మంది గ్రామ సమన్వయకర్తలకు న్యాయం చేయాలని ఉమ్మడి విజయనగరం జిల్లా సాక్షర భారత్ గ్రామ సమన్వయకర్తల యూనియన్ ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు.



## టీడీపీకి కమిట్మెంటున్న కార్యకర్తలున్నారు కనుకనే..

# ధైర్యంగా పోరాడాం

**కష్టకాలంలో కలిసిమెలిసి పనిచేసినప్పుడు అనుబంధం ఏర్పడుతుంది**

**వైసీపీ హయాంలో వేధింపులకు గురైన టీడీపీ కార్యకర్త షేక్ అల్లాబక్షు**

**ఉండవల్లి నివాసానికి పిలిపించుకుని మాట్లాడిన మంత్రి లోకేష్**

**ఇద్దరు పిల్లల బాధ్యత తీసుకుని అన్నివిధాల అండగా ఉంటానని భరోసా**

**ఉండవల్లి, జులై 01 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

తెలుగుదేశం పార్టీకి కమిట్ మెంట్ ఉన్న కార్యకర్తలు ఉన్నారు కనుకనే గత వైసీపీ రాక్షస పాలనలో ధైర్యంగా పోరాడగలిగామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. కార్యకర్తే అధినేత అనే మాటను శిరసావహిస్తూ.. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను నేరుగా కలుసుకుని వారికి అండగా నిలుస్తున్నారు మంత్రి లోకేష్. వైసీపీ పాలనలో ఆ పార్టీ నాయకుల వేధింపులకు గురై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గం ఆర్మేనిపాడు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త షేక్ అల్లాబక్షును కుటుంబంతో సహా ఉండవల్లి నివాసానికి పిలిపించుకుని మంత్రి మాట్లాడారు. నాలుగు దశాబ్దాలుగా అల్లాబక్షు కుటుంబం పార్టీకి సేవలందిస్తోంది. ప్రస్తుతం మండల మైనార్టీ సెల్ అధ్యక్షునిగా అల్లాబక్షు పనిచేస్తున్నారు. పార్టీ పిలుపునిచ్చిన అన్ని కార్యక్రమాల్లో పాల్గొంటూ ఉత్తమ కార్యకర్తగా నిలిచారు. వైసీపీ దాష్టీకాలకు ఎదురొడ్డి 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీటీసీ, సర్పంచ్ అభ్యర్థులను నిలబెట్టారు. దీంతో తన 3.50 ఎకరాల్లో జామాయిల్ తోటను ఆ పార్టీ గూండాలు నరికివేయడంతో పాటు సదరు భూమిని కక్షతో నిషిద్ధ భూముల జాబితా 22-ఏలో చేర్చారు. తాను కొత్తగా నిర్మించుకుంటున్న ఇంటి గోడను కూల్చి భయభ్రాంతులకు గురిచేశారు.

**అల్లాబక్షు కుటుంబానికి అన్నివిధాల అండగా ఉంటామని మంత్రి లోకేష్ భరోసా**

అల్లాబక్షు కుటుంబ సభ్యులతో మాట్లాడిన మంత్రి నారా లోకేష్.. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఇద్దరు కుమార్తెల చదువు గురించి ఆరా తీశారు. పార్టీ కోసం తాను చేపట్టిన కార్యక్రమాలను అల్లాబక్షు వివరించారు. కుమార్తెల చదువుకు సాయం అందించాలని, తన భూమిని నిషిద్ధజాబితా నుంచి తొలగించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. మీ వంటి కమిట్ మెంట్ ఉన్న కార్యకర్తలు ఉన్నారు కనుకనే ధైర్యంగా పోరాడగలుగుతున్నాం. కష్టకాలంలో కలిసిమెలిసి పనిచేసినప్పుడు అనుబంధం ఏర్పడుతుంది. మీ నుంచి మేము, మా నుంచి మీరు నేర్చుకుని పార్టీని పటిష్టం చేయవచ్చు. నాలుగు దశాబ్దాలుగా పార్టీ కోసం త్యాగం చేశారు. మీకు అండగా నిలబడాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. ఇద్దరు బిడ్డలను చదివించే బాధ్యత తీసుకుంటానని, సొంత పిల్లల్లా చూసుకుంటానని హామీ ఇచ్చారు. భూమి విషయంలో అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మైనార్టీ సోదరులకు నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. పిల్లలు బాగా చదువుకోవాలని, విద్య ద్వారానే ఉన్నత స్థాయికి చేరుకుంటామని, తల్లిదండ్రులను బాగా చూసుకోవాలని చెప్పారు. మంత్రి నారా లోకేష్ స్వయంగా మాట్లాడి తమకు అండగా నిలవడం పట్ల నోటమాట రావడం లేదని, ఆనందంగా ఉందని అల్లాబక్షు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.





## అభివృద్ధి, సంక్షేమ పథకాలను

# ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి..

**అమలాపురం, జులై 01 (తెలుగురాష్ట్రం ప్రతినిధి**

అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సూచించారు. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయటానికి మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇంచార్జి, గ్రామకమిటీ అధ్యక్షులు, బూత్ కన్వీనర్లకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో జరిగిన పలు సంక్షేమ పథకాలు అమలు గూర్చి ప్రజలకు తెలియజేయవలసిందిగా కార్యకర్తలు, బూత్ కన్వీనర్లకు మార్గనిర్దేశం చేశారు. అనంతరం తెలుగుదేశం పార్టీ బలోపేతం చేయటానికి గ్రామా స్థాయి నుండి కార్యకర్తల సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వ విధానాలను ప్రజల దృష్టికి తీసుకునివెళ్లేందుకు అవసరం అయినా విషయాలను తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు,ఆముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, రాష్ట్ర DCMS చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, నియోజకవర్గ పరిశీలకులు పెచ్చెట్టి బాబు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ సత్తిబాబు రాజు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం, మట్టా మహాలక్ష్మిప్రభాకర్ , అమలాపురం పట్టణ టిడిపి అధ్యక్ష్యులు తిక్కిరెడ్డి నేతాజీ, ఉప్పలగుప్తం టిడిపి అధ్యక్ష్యులు అరిగెలా నానాజీ, మాజీ జడ్పీటీసీ శ్రీమతి అధికారి జయవెంకటలక్ష్మి బాబ్జి, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, ఆశెట్టి ఆదిబాబు, మాడ మాధవి, రాజులపూడి భీముడు, క్లస్టర్ ఇంచార్జి, గ్రామకమిటీ అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు
















డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

తెలుగురాష్ట్రం దినపత్రిక

https://epaper.teluguraastram.com

బుధవారం 02 జులై 2025

# సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం

## -సంక్షేమంలో అభివృద్ధిలో మనమే ముందున్నాం.



**కొత్తపేట, జూలై 01 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు. మంగళవారం కొత్తపేట కాపు కళ్యాణ మండపంలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది కాలంలో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో మంచి పనులు చేసింది. వాటిని జనాల్లోకి చేర్చాలి. మనం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలియజెప్పాలి. అలాగే పూర్తి చేయలేని పనులపై స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత కూడా మనదే అని చెప్పారు. 2014-19లో మంచి పాలన చేసినా ప్రచార లోపం వల్ల నష్టపోయామని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా అదే తప్పు చేయకూడదన్న ఉద్దేశంతో ప్రతిపని ప్రజల వద్దకు వెళ్లేలా చూడాలి అని నేతలకు సూచించారు.రాష్ట్రం పటిష్టంగా ముందుకు సాగుతోందని వివరించిన ఆయన పారిశ్రామిక రంగంలో భారీగా పెట్టుబడులు వచ్చాయని, రూ.9,340 కోట్ల విలువైన ఒప్పందాలు జరిగాయని వీటితో 8.5 లక్షల మందికి ఉద్యోగాలు లభిస్తాయని, టీసీఎస్, గూగుల్, కాగ్నిజెంట్ వంటి కంపెనీలు రాబోతున్నాయని చెప్పారు. సంక్షేమ పథకాల వివరాలు 64 లక్షల మందికి పింఛన్లు %-% ఏడాదికి రూ.34 వేల కోట్లు, మత్స్యకార భరోసాకు రూ.250 కోట్లు, తల్లికి వందనం ద్వారా 67.27 లక్షల మందికి నగదు, దీపం-2 పథకం కింద ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు, 204 అన్నా క్యాంటీన్లు %-% ఒక్కసారి భోజనం రూ.5కే, ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉపాధ్యాయ నియామక ప్రక్రియ తుది దశలో ఉందని, 16,347 పోస్టులు భర్తీ కానున్నాయని, అర్చకులకు రూ.15వేలు, నాయీ బ్రాహ్మణులకు రూ.15వేలు, పాస్టర్లకు, ఇమామ్లకు రూ.5 వేలు చొప్పున గౌరవ వేతనాలు ఇస్తున్నట్లు తెలిపారు. పోలవరం పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. అమరావతి నిర్మాణం కొనసాగుతోందని వివరించారు. టెక్నాలజీలో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లేలా వాట్సాప్ గవర్నెన్స్ సేవలు 703కు పెంచామని తెలిపారు. కుటుంబం, కులం పేరుతో విభజనలు రెచ్చగొడుతున్న ప్రతిపక్షాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. జూలై 2 నుంచి ఇంటింటి ప్రచారాన్ని విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, పలివెల ప్రకాష్, నాలుగు మండలాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యేగా తనకు అర్హత అందించిన వ్యక్తి అంబేద్కర్

## అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల



**అమలాపురం, జూన్ 01 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

శాసన సభ్యునిగా చంద్రబాబు నాయుడు జన్మనిస్తే ఆ అర్హత అందించిన వ్యక్తి అంబేద్కర్ అని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. తన క్యాంపు కార్యాలయం లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేద్కర్ ఇచ్చినరిజర్వేషన్ల వల్లే నాకు అవకాశం వచ్చింది. అందుకే అంబేద్కర్ రాజ గృహం ముంబయి లో పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నాను. అంబేద్కర్ మనమడు ఆనంద్ అంబేద్కర్ సమక్షంలో పుట్టినరోజు జరుపుకోవడం మరువలేనిది అన్నారు. అంబేద్కర్ నివసించిన రాజ గృహంలో ఈ వేడుకలు జరిగాయి అన్నారు. జ్యోతిరావ్ పూలే మహోన్నత వ్యక్తి. ఆయన చరిత్ర మరింత గొప్పది. ఆయన నిమ్న జాతులకు అండగా నిలిచిన వ్యక్తి అని అన్నారు. పూలే సామాజిక పోరాటం చేస్తే ఆ పోరాటాన్ని అంబేద్కర్ చట్ట బద్దం చేశారు. అంబేద్కర్ వ్యక్తి కాదు శక్తి అని ఆనందరావు అన్నారు. వారి ఇద్దరు సమాధులు సందర్శించాను. వారికి నివాళులు అర్పిస్తున్నానని ఆయన అన్నారు.ముంబయి ఆంధ్ర మహాసభ భవనంలో అక్కడ తెలుగు వారు నా పుట్టినరోజు ను ఘనంగా నిర్వహించారు. వారికి కృతజ్ఞతలు అని ఎమ్మెల్యే అన్నారు. పాత్రికేయులు సమావేశంలో టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, నాయకులు సత్తిబాబు రాజు బొర్రా ఈశ్వర రావు, కర్రి దత్తుడు, తిక్కిరెడ్డి నేతాజీ తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటీ ఎంపీడీవో కృష్ణ సేవలు ప్రశంసనీయం



**రావులపాలెం: జూలై 01, (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

రావులపాలెం డిప్యూటీ ఎంపీడీవో గా సుదీర్ఘకాలం పాటు విశేష సేవలందించిన గంగుల కృష్ణ సేవలు ఎంతో ప్రశంసనీయమని ఎంపీడీవో ఇ.ఉమామహేశ్వరరావు, డిఎల్డిఓ టి.వి.రాజేశ్వరరావు, డిఎల్పీఓ ఏ.రాజులు కొనియాడారు. కృష్ణ పదవి విరమణ వేడుకలు ఊబలంక ఎస్ఎస్ ఫంక్షన్ హాల్లో జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వారు మాట్లాడుతూ ఎప్పుడూ అధికారి అనే దర్పం ప్రదర్శించకుండా కష్టపడి పనిచేసే తత్వం కృష్ణ లో ఉందన్నారు. పదవీ విరమణ చేసిన చివరి రోజు వరకూ విధినిర్వహణలో తన ప్రత్యేకతను చాటుకున్నారని ప్రశంసించారు. మండల పరిధిలో గ్రామ పంచాయతీ పరిధిలో సమస్యలు పరిష్కారానికి తనవంతు కృషి చేసేవారని జడ్పిటిసి కుడిపూడి శ్రీనివాస్ పేర్కొన్నారు. అలాగే పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యదర్శులు కృష్ణ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పదవీ విరమణ చెందిన కృష్ణ మాట్లాడుతూ గోదావరికి అటువైపున గల ఆలమూరులో జన్మించి అక్కడే చదువుకుని ఉద్యోగం సాధించానని ఇప్పుడు గోదావరికి ఇవతల రావులపాలెంలో పదవీ విరమణ చెందడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కృష్ణ వెంకటలక్ష్మి దంపతులను పూలమాలలు, శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఎంపీడీవో మహేష్, మండలపరిషత్ ఎవో కె.మంగతాయారు, సీనియర్ అసిస్టెంట్ కె.శారద, జూనియర్ అసిస్టెంట్ విజయ్ గ్రామ పంచాయతీ కార్యదర్శులు గజమాలతో ప్రత్యేకంగా సత్కరించి బంగారు ఉంగరాన్ని బహుకరించారు. ఆయనతో పాటు పని చేసిన జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కృష్ణతో కలిసి పనిచేసిన పలువురు అధికారులు, ఉద్యోగులు, బంధువులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# వద్దిపర్రులో ఉచిత రక్తదాన శిబిరం

## -తలసేమియా బాధిత పిల్లలకు రక్తదానం చేసిన గ్రామ యువత





**ఆత్రేయపురం, జూలై 01: (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

మనుషులంటే మమకారం, మనుగడ కోసం సేవాభావం ఉన్నప్పుడు ప్రతి రోజూ పండుగలా మారుతుంది. ఈ మాటకు నిజమైన అర్థం తెలియజేశారు అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం లోని వద్దిపర్రు గ్రామ యువత. తమ గ్రామానికి చెందిన ఐఏఎస్ అధికారి పల్లేటి రాజబాబు జన్మదినాన్ని పురస్కరించుకుని, వారిపై ఎంతో ఆత్మీయత, సేవా భావంతో ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించి తమ అభిమానాన్ని సేవామార్గంలో చాటారు.ఈ సందర్భంగా యువత పల్లేటి ట్రస్ట్ అనే సేవా సంస్థను స్థాపించి, దాని ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో సుమారు 30 మంది యువకులు పాల్గొని స్వచ్ఛందంగా రక్తాన్ని దానం చేశారు. తలసీమియాతో బాధపడుతున్న చిన్నారుల కోసం ఈ రక్తాన్ని కాకినాడ రెడ్క్రాస్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది సేకరించారు. శిబిరానికి గ్రామస్థులు, పెద్దలు కూడా హాజరై యువత ప్రయత్నాన్ని అభినందించారు. ప్రస్తుతం పల్లేటి రాజబాబు ఐఏఎస్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్గా, అలాగే ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వారు ఐఏఎస్ అధికారిగా ఉన్నా, తమ గ్రామం పట్ల గల సానుభూతి, మానవీయత యువతలో ప్రేరణగా నిలిచినట్టు గ్రామస్థులు తెలిపారు. ఈ సందర్భంగా యువత మాట్లాడుతూ %-% మన గ్రామం నుంచి వెళ్ళి అత్యున్నత స్థాయి అధికారిగా ఉన్న వ్యక్తి పుట్టినరోజును మేం సామాజిక సేవతో గుర్తించాలనుకున్నాం. ఆయన్ని గౌరవించడమే కాకుండా, ఇది భవిష్యత్ తరం కోసం కూడా మార్గదర్శకంగా ఉంటుంది అని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామ యువత సేవా దృక్పథాన్ని ప్రదర్శించడంతో పాటు, గ్రామానికి చెందిన పల్లెటి రాజబాబు పై గల అభిమానాన్ని నిస్వార్థంగా చాటారు.

# ఎన్టీఆర్ భరోసా పథకంతో సామాజిక భద్రత

## - జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ - అమలాపురంలో రూ.1.94 కోట్ల ఫించన్ల నగదు పంపిణీ



**అమలాపురం, జూలై 1, (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

పేదలకు ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా సామాజిక భద్రతతో పాటు గౌరవ ప్రద జీవితానికి భరోసా ఏర్పడుతోందని అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అన్నారు. మంగళవారం అమలాపురం పురపాలక సంఘం 25వ వార్డు 15వ సచివాలయ పరిధిలో వార్డు సచివాలయ కార్యదర్శులు, ప్రభుత్వ ఉద్యోగులు చేపట్టిన ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి వికలాంగులు, వృద్ధులకు స్వయంగా పింఛన్లను అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటిష్ట పర్యవేక్షణ, సమన్వయంతో సజావుగా పెన్షన్ల పంపిణీ జరుగుతోందన్నారు. స్వర్ణాంధ్ర 2047 దార్శనికతకు అనుగుణంగా ప్రత్యేక ప్రణాళికతో పీ4 వంటి వినూత్న విధానాలను ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు తెలిపారు. పురపాలక సంఘ పరిధిలో అన్ని కేటగిరీలు కలిపి మొత్తం 4,361 మందికి రూ.1,94,72,000 పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. 25వ వార్డులో 193 మందికి రూ 8,51,500 లు కేటగిరీల వారీగా పంపిణీ జరుగుతోందన్నారు. ఎక్కడా ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా అత్యంత పారదర్శకంగా, జవాబుదారీ తనంతో ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పెన్షన్ల మొత్తాన్ని లబ్దిదారుల ఇళ్ల వద్దే అందిస్తున్నట్లు తెలిపారు. భర్త సామాజిక భద్రతా పింఛను పొందుతూ మరణిస్తే, భార్యకు తదుపరి నెల నుంచే పింఛను అందేలా స్పౌజ్ పింఛన్ కేటగిరీని తాజాగా ప్రవేశ పెట్టారన్నారు. కొన్ని సందర్భాల్లో ఒకటో తేదీ సెలవు దినం వస్తే ఒకరోజు ముందు గానే పింఛన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. ఒకటో తేదీన ఏదైనా కారణం చేత పింఛను తీసుకోలేని వారికి తదుపరి ఒకటి, రెండు రోజుల్లో మళ్ళీ పంపిణీ చేస్తారని లబ్ధిదారులు ఎవరు ఆందోళన చెందాల్సిన పనిలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘ కమిషనర్ నిర్మల్ కుమార్, డి.ఆర్.డి.ఏ పిడి సాయినాథ్ జయచంద్ర గాంధీ పాల్గొన్నారు.



# కొత్తపేట సబ్ డివిజన్ లో సెక్షన్ 30 అమలు

## - డీఎస్పీ సుంకర మురళీ మోహన్



**కొత్తపేట, జూలై 1, (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

కొంతమంది సంఘ వ్యతిరేక శక్తులు హింసాత్మక చర్యలకు పాల్పడటం ద్వారా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉందనే సమాచారంతో కొత్తపేట సబ్-డివిజన్ లోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో జూలై 1వ తేదీ ఉదయం నుంచి 31వ తేదీ అర్ధరాత్రి వరకు (31 రోజులు) ఇండియన్ పోలీస్ యాక్ట్ 1861 సెక్షన్ 30 అమలు చేస్తున్నామని కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీ మోహన్ తెలిపారు. ఈ నేపథ్యంలో కొత్తపేట సబ్ డివిజన్ పరిధిలోని కొత్తపేట, రావులపాలెం, ఆలమూరు, ఆత్రేయపురం, పి.గన్నవరం, అంబాజీపేట, అయినవిల్లి, నగరం, రాజోలు, సఖినేటిపల్లి, మల్కిపురం పోలీస్ స్టేషన్ల పరిధిలో ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి బహిరంగ సభలు, సభలు, ఊరేగింపులు, ర్యాలీలు, పాదయాత్రలు వంటి కార్యక్రమాలు నిర్వహించరాదని స్పష్టం చేసారు. ఏదైనా కార్యక్రమం జరుపుకునేవారు 24 గంటలకు ముందుగా తమ అనుమతి తీసుకోవాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు తీసుకుంటున్న చర్యలకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని డీఎస్పీ మురళీమోహన్ కోరారు.

# బోడసకుర్రులో విఆర్వో ఉల్లిస్ కు ఘనసన్మానం...



**అల్లవరం, జులై 1(తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

బోడసకుర్రు పంచాయతీ పరిధి సచివాలయం2 లో విధులు నిర్వహిస్తూ పదివి విరమణ సందర్భంగా విఆర్వో ఉల్లిస్ కు గ్రామ పంచాయతీ సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి నాగేశ్వరరావు పుష్పగుచ్చాలను అందించి దుస్సలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సర్పంచ్ విజయలక్ష్మి మాట్లాడుతూ విఆర్వో ఉల్లిస్ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ఏనలేని సేవలు ప్రజలకు అందించారని ఆయన సేవలపై కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అడపా వెంకటేశ్వరరావు,ముత్యాల బాబీ,పాలక వర్గ సభ్యులు ఓలేటి పరమేష్,అడపా శ్రీను, అయిల నాగేశ్వరరావు,రోళ్ళ శ్రీను,కార్యదర్శి బి. ఆదిశంకరం,విఆర్వో చిట్టిబాబు,సచివాలయం ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు అపార అనుభవంతో సమర్ధవంతమైన పాలన

## - అమలాపురం ఎంపీ హరీష్ బాలయోగి

**అయినవిల్లి, జూలై 1, (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**







రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు తన అపార అనుభవంతో అభివృద్ధి, సంక్షేమాలను ప్రజలకు సమపాళ్లలో అందిస్తూ సమర్ధవంతమైన పాలన అందిస్తున్నారని అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి అన్నారు. అయినవిల్లి మండలం అయినవిల్లి లంక గ్రామంలో మంగళవారం ఆయన ఎన్టీఆర్ భరోసా సామాజిక ఫించన్ల పంపిణి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి వివిధ రకాల ఫించన్ల మొత్తాన్ని లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫించనుదారులకు ఇటువంటి ఇబ్బందులు లేకుండా ప్రతి నెలా 1వ తేదీన ఉదయాన్నే ఇంటి వద్దనే ప్రభుత్వం ఫించన్లు పంపిణీ చేస్తుందని ఎంపీ హరీష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.విద్యామిత్ర స్టూడెంట్ కిట్స్ పంపిణీ :అయినవిల్లిలంక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రాష్ట్ర విద్యా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర స్టూడెంట్ కిట్లను అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్ది విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మంచి ఫలితాలు వచ్చే దిశగా మంత్రి నారా లోకేష్ చర్యలు చేపట్టారని తెలిపారు. ఈ విద్యామిత్ర పథకానికి సర్వేపల్లి రాధాకృష్ణ పేరును పెట్టడం ద్వారా రాజకీయాలకు అతీతంగా దేశ నాయకులను గౌరవించే విధంగా ఉండాలనేదే తమ ప్రభుత్వ విధానమని ఎంపీ హరీష్ బాలయోగి స్పష్టం చేసారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


# ప్రాణాలు పోసే దేవుళ్ళు వైద్యులే

### -డాక్టర్స్ డే సందర్భంగా డా గోపాలకృష్ణంరాజు, డా శంకర్ వర్మ, డా మల్లీశ్వరీ, రాజులకు సత్కారం



**భీమవరం జూలై 1, (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** మన దేశంలో వైద్యులంటే ప్రజలకు ఒక నమ్మకం, ఒక విశ్వాసమని, ప్రాణాలు పోసే దేవుడు వైద్యుడని లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కోశాధికారి బొండా రాంబాబు, కనగర్ల రామకృష్ణ అన్నారు. భీమవరం జెపి రోడ్డులోని జెపి కంప్యూటర్స్ దగ్గర మంగళవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే, చార్టెడ్ అకౌంటెంట్ డే సందర్భంగా డా ఎం గోపాల కృష్ణంరాజు, డా ఎన్ శంకర్ కుమార్ వర్మ, డా చుండూరి మల్లీశ్వరి, సిఎ కేఎస్ఎన్ రాజులను సత్కరించారు. క్లబ్ సభ్యులు మాట్లాడుతూ వైద్యులకు రోగి మధ్య బలమైన బంధం ఉంటుందన్నారు. సత్కార గ్రహీతలు మాట్లాడుతూ సమాజంలో అత్యంత పవిత్రమైన కీలకమైన వృత్తి వైద్యమని, ఆపద సమయంలో ప్రజలందరికీ ఆపద్బాంధవుడిలా కనిపించే వైద్యులను ప్రజలు ఎంతగానో గౌరవిస్తారని అన్నారు. మనిషికి ఎంత సంపద ఉన్నా దాన్ని అనుభవించే ఆరోగ్యం లేకపోతే అదంతా వృథాయేనని, అనారోగ్యంతో బాధపడే వారిని ప్రమాద స్థితి నుంచి కాపాడే శక్తి కేవలం వైద్యునికే ఉందన్నారు. కార్యక్రమంలో నడింపల్లి మహేష్, విశ్వనాథరాజు, గోపిశెట్టి మురళి, ఆదిత్య కృష్ణంరాజు సభ్యులు పాల్గొన్నారు.

# మూడు రోజులపాటు అల్లూరి జయంతోత్సవాలు




**భీమవరం జూలై 1, (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** భీమవరంలో ఈనెల 2,3,4 తేదీల్లో విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతోత్సవాలను నిర్వహిస్తున్నట్లు అల్లూరి సీతారామరాజు యువజన సంఘాల జిల్లా సమాఖ్య అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి తెలిపారు. మంగళవారం భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీపద్మావతి వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. 2వ తేదీన క్విట్ ఇండియా స్థూపం వద్ద జయంత్సవాలను ప్రారంభిస్తామని, 4న ప్రధాని మోదీ ఆవిష్కరించిన అతిపెద్ద అల్లూరి సీతారామరాజు కాంస్య విగ్రహం వద్ద ముగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, మూడు రోజులపాటు భీమవరం పట్టణంలోని అన్ని ప్రాంతాల్లోను ఈ జయంతోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరుతున్నామని అన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు వబిలిశెట్టి రామకృష్ణ, కుక్కల బాల, జనపాటి మధు సుధన్ రావు, ఫణి తదితరులు పాల్గొన్నారు.

# వైద్యులు, చార్టెడ్ అకౌంటెంట్ల సేవలు వెలకట్టలేనివి

### - డా రామకృష్ణ, సీఏ శ్రీకాంత్ గుప్తా, సీఏ ప్రతాప్ లను సత్కరించిన మార్నింగ్ కాఫీ క్లబ్



**భీమవరం జూలై 1, (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** తల్లిదండ్రులు జన్మనిస్తే వైద్యులు పునర్జన్మను ఇస్తారని, వ్యాపారస్తులకు, ప్రభుత్వాలకు వారధి చార్టెడ్ అకౌంటెంట్లు అని మార్నింగ్ కాఫీ క్లబ్ కన్వీనర్ బొండా రాంబాబు, కో కన్వీనర్ ఓలేటి శ్రీనివాస్, పిఆర్వో భట్టిప్రోలు శ్రీనివాసరావు, మానేపల్లి వెంకన్నబాబు అన్నారు. మార్నింగ్ కాఫీ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే, సిఎ డే సందర్భంగా మంగళవారం డా నడింపల్లి రామకృష్ణ, సీఏ మండా శ్రీకాంత్ గుప్తా, సీఏ గుండా ప్రతాప్ లను సత్కరించారు. బాధల నుంచి శరీరాన్ని, విపత్తుల నుంచి ప్రాణాన్ని కాపాడే ప్రత్యక్ష దైవాలే డాక్టర్లని కొనియాడారు. ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తున్న వైద్యులు దైవంతో సమానమని, వారి సేవలు వ్యాపారంలో సతమత అవ్వుతూ ఉంటె వారి ఆర్థిక లావాదేవీలను సరైన మార్గములో పెట్టేవారే చార్టెడ్ అకౌంటెంట్ అని వారి వెలకట్టలేనివని కొనియాడారు. కార్యక్రమంలో కారుమూరి సత్యనారాయణ, కనగర్ల రామకృష్ణ, బొండా హనుమంతరావు, కొల్లేపర్ల సుబ్బారావు, బాయ్స్ శ్రీనివాస్, చవ్వ శ్రీనివాస సుబ్బారావు, కోట్ల నాని, బొడ్డు వాసు, బొండాడ సుబ్బారావు, మానేపల్లి చిన్నారావు, కురిశెట్టి సతీష్, కారుమూరి బధరి పాల్గొన్నారు.

# రైతులకు మేలు చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

### -32 మంది వరి రైతులకు ఉచితంగా సీడ్ అందించిన ఎమ్మెల్యే అంజిబాబు



**భీమవరం జూలై 1, (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** రైతులను అదుకునేందుకు ప్రభుత్వం అన్ని రకాల పథకాలను అందిస్తుందని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. వీరవాసరం మండలంలోని 23 గ్రామ పంచాయతీలోని 32 మంది వరి రైతులకు సంపద రకం పౌండేషన్ సీడ్ ను ఉచితంగా ఎమ్మెల్యే అంజిబాబు అందించారు. ఈ సీడ్ ద్వారా రానున్న రెండేళ్లలో స్వచ్ఛందంగానే సీడ్ ను తయారు చేసుకోవచ్చునని, ఈ విత్తనంతో నాణ్యమైన పంట పడుతుందని అన్నారు. కార్యక్రమంలో వీరవాసరం మండలంలోని గ్రామస్తులు, పెద్దలు, కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు వీర మహిళలు పాల్గొన్నారు.

# ప్రతిఒక్కరూ నెలలో రెండురోజులైన వైద్య పరీక్షలు చేయించుకోవాలి ..



**భీమవరం జూలై 1, (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** ఆరోగ్యకర సమాజ స్థాపనలో వైద్యుల పాత్ర కీలకమని, వైద్యులు ప్రాణదాతలని, నెలలో రెండురోజులైన వైద్య పరీక్షలు చేయించుకోవాలని టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్ధసారధి అన్నారు. మంగళవారం జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా భీమవరం సిఎస్ఎన్ కళాశాలలో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో 50 ఏళ్ల సుదీర్ఘ అనుభవం కలిగిన చిన్నపిల్లల వైద్యులు డా చిడే సత్యనారయణ ను సత్కరించారు. మెంటే పార్ధసారధి మాట్లాడుతూ సరైన సమయంలో సరైన చికిత్స అందించి వైద్యులు సమాజసేవలో ఇదే స్థాయిలో ముందుకు వెళ్లాలని కోరారు. హనుమాన్ జంక్షన్ డా మేఘన, కళాశాల ప్రిన్సిపాల్ డా సకుమళ్ళ సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ వడుపు గోపి, కేజీఆర్ఎల్ కళాశాల సంయుక్త కార్యదర్శి అరేటి ప్రకాష్, చెరుకువాడ రంగసాయి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డా ఎండి సలీం ఖాన్, డా రావు, టి నిర్మల, బొమ్మదేవర ప్రభాకర రావు, అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు వరదలకు అప్రమత్తంగా ఉండాలి



**వి ఆర్ పురం, జులై 1(తెలుగు రాష్ట్రం విలేఖరి):** వి ఆర్ పురం మండల పరిషత్ కార్యాలయంలో ఐటీడీఏ పి ఓ అపూర్వ భరత్ ప్రజా ప్రతినిధులు, అధికారులతో మంగళవారం వరదల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముంపు ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారు వరదలు సమయంలో అధికారులకు ప్రజలు సహకరించాలని సూచించారు. వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అన్ని ప్రాంతాల్లో బోట్లు, ఇతర వాహనాలను సిద్ధంగా ఉంచడం జరుగుతుందన్నారు.రహదారి మార్గం మూసుకొని పోయే గ్రామాలను ఆయన సందర్శించటం జరిగింది.ఈ కార్యక్రమం లో మండలం లోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులు, అధికారుల, నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొని ఐటీడీఏ పి ఓ కి మండలంలోని వరద సమస్యల గురించి, వరదలలో ఎదురుకొనే ఇబ్బందుల సమయం లో కావలసిన వసతులు నిత్యావసరల గురించి క్లుప్తంగా వివరించి సహాయ సహకారాలు అందించాలని అధికారులను, ప్రభుత్వం ను కొరట మైనది, అందుకు పి ఓ సానుకూలంగా స్పందించి అన్ని రకముల వసతులు కల్పించే ఏర్పాటు చేయటానికి, ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి, అన్ని అందుబాటు లో ఉంచే ప్రయత్నం చేస్తాం అని ఆయన తెలియజేశారు. ఈ సమావేశం లో జెడ్ పి టి సీ వాళ్ళ రంగారెడ్డి, యం పి పి కారం లక్ష్మి,తహసీల్దార్ సరస్వతి, యస్ ఐ సంతోష్ కుమార్, డి ఎం హెచ్ ఓ పుల్లయ్య, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ అధ్యక్షుడిగా మాధవ్ ఎన్నికపట్ల జిల్లా బీజేపీ ఎస్సీ మోర్చా హర్షం



**రాజమహేంద్రవరం, జూలై 1(తెలుగురాష్ట్రం ప్రతినిధి):** ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా సీనియర్ నేత, బిసీ నాయకుడు అయిన పీవీఎన్ మాధవ్ ఏకగ్రీవ ఎన్నిక పట్ల తూర్పుగోదావరి జిల్లా బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దున్న సుమన్ బాబు అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మాధవ్ కు ఎబివిపి నుండి బీజేపీతో సహవాసం మొదలైందని, నిజాయితీతో కూడిన రాజకీయం చేస్తూ సమర్ధవంతమైన నాయకుడిగా మాధవ్ పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. 2024 ఎన్నికలలో కూటమిపార్టీల్లోని అభ్యర్థుల విజయానికి కష్టపడి పనిచేశారని పార్టీ తీసుకొనే నిర్ణయాలకు కట్టుబడి ఉంటారని,అందుకే బీజేపీ అధినాయకత్వం మాధవ్ ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులుగా ఏకగ్రీవం గా ఎన్నుకున్నారని సుమన్ బాబు పేర్కొన్నారు.పార్టీ కోసం కష్టపడిన వారికి బీజేపీలో సరైన గుర్తింపు వస్తుందన డానికి ఇదే నిదర్శనమని దున్న సుమన్ బాబు అన్నారు. మాధవ్ ఏకగ్రీవ ఎన్నిక పట్ల బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు పి.యుగంధర్, జి.కేశవ, ఎం రవికుమార్, బి.నిరంజన్ బాబు, పి. ధర్మ హర్షం వ్యక్తం చేశారు.

# డొక్కా సీతమ్మ భోజనశాల ఏర్పాటు అభినందనీయం.

### -ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.






**కొత్తపేట, జూలై 1, (తెలుగురాష్ట్రం ప్రతినిధి)** ఆంధ్రుల అన్నపూర్ణగా పేరు గడించిన డొక్కా సీతమ్మ పేరుతో ఏర్పాటు చేసిన భోజనశాల అభినందనీయమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మంగళవారం ఆయన గొలకోటివారిపాలెంలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి మంగళవారం 200 మందికి అన్నదానాన్ని నిర్వహించే విధంగా ఏర్పాటు చేసిన సీతమ్మ వారి భోజనశాల, పాంచాల రేవు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం గొలకోటి మాధవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వస్త్రదాన కార్యక్రమంలో పాల్గొని, 50 మంది పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మాదిగ జాతి మీకు ఆజన్మాంతం రుణపడి ఉంటుంది

### -చంద్రబాబుకు మాజీ ఎమ్మెల్యే టివి కృతజ్ఞతలు



**కొవ్వూరు, జులై 1 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** మాదిగలకు మీరు చేసిన మేలు మర్చిపోలేం, మాదిగ జాతి మీకు ఆజన్మాంతం రుణపడి ఉంటుందని కొవ్వూరు జనసేన ఇంఛార్జి, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు అన్నారు. పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు కొవ్వూరు నియోజకవర్గం తాళ్లపూడి మండలం మలకపల్లి విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబును... టీవీ రామారావు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబుకు డప్పును బహుకరించి కృతజ్ఞతలు తెలిపారు. మాదిగలకు శాశ్వత న్యాయం చేసిన మిమ్మల్ని మా జాతి ఎల్లప్పుడూ గుర్తుంచు కుంటుందని అన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు గారితో కలిసి బాబ్లీ ఆందోళనలో పాల్గొన్నపుడు మహారాష్ట్ర పోలీసుల నిర్బంధించిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు.

# ఫిట్ నెస్ విషయంలో పాత విధానమే కొనసాగించాలి

### -రాజానగరం ఎటిఎస్ కేంద్రం వద్ద నిరసన-కంబాల చెరువు నుంచి జేఏసీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

**రాజమహేంద్రవరం, జూలై 1(తెలుగురాష్ట్రం (ప్రతినిధి) :**



రవాణా వాహనాల ఫిట్‌నెస్‌ను (బ్రేక్) రవాణా శాఖ అధికారుల నుండి ప్రైవేట్ సంస్థలకి కూటమి ప్రభుత్వం అప్పగించడాన్ని నిరసిస్తూ చేపట్టిన ఛలో రాజానగరం విజయవంతమైందని జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్లు వాసంశెట్టి గంగాధరరావు, బాక్స్ ప్రసాద్ వెల్లడిరచారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం స్పందించి దీనిపై సరైన నిర్ణయం తీసుకుని ఎటిఎస్ సెంటర్ల విషయంలో రవాణా వాహనాల విషయంలో సానుకూలంగా స్పందించాలని కోరారు. చలో రాజానగరం సందర్భంగా స్థానిక కంబాల చెరువు హైటెక్ బస్టాండ్ వద్ద నుంచి లారీలు, ఆటోలు, మినీ వ్యాన్లు, గూడ్స్ వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ ప్రారంభించారు. ఆయన కార్మికులతో కలిసి రాజానగరం ఎటిఎస్ సెంటర్ వద్దకు చేరుకుని వారి నిరసనలో భాగస్వాములయ్యారు. జేఏసీ ఆందోళనకు డిసిసి అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు తదితరులు మద్దతుగా నిలిచారు. మార్గాని మాట్లాడుతూ ఆటోలు, మినీవ్యాన్లు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న రవాణా వాహనాల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంత కర్కశంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఫిట్‌నెస్‌కు ఎటిఎస్ సెంటర్లను ఏర్పాటు చేయనప్పటికీ ఆంధ్రప్రదేశ్ అత్యుత్సాహం ప్రదర్శించడం దారుణమన్నారు. వెంటనే ఈ విధానాన్ని ఉప సంహరించాలని, పాత పద్ధతిలోనే ఎంవిఐల ద్వారా వాహనాల ఫిట్‌నెస్ తనిఖీ చేయించుకునే పద్ధతిని తీసుకుని రావాలని డిమాండ్ చేసారు. టీకే మాట్లాడుతూ రవాణా కార్మికులు ఇప్పటికే చాలా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. రాజానగరం ఎటిఎస్ సెంటర్ వద్ద జరిగిన ధర్నాలో వాహనాల యజమానులు, కార్మిక సంఘాల నాయకులు పెద్దఎత్తున ఉత్సాహంగా పాల్గొన్నారు. వాసంశెట్టి మాట్లాడుతూ ఇప్పటికే ఎటిఎస్ సెంటర్లకు వ్యతిరేకంగా అఖిల పక్ష పార్టీల మద్ధతు కూడగట్టామని, త్వరలోనే జేఏసీ సమావేశంలో చర్చించి తదుపరి కార్యాచరణ చేస్తామని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రవాణా కార్మికులకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదని స్పష్టం చేసారు. బాక్స్ ప్రసాద్ మాట్లాడుతూ రవాణా కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. పక్కనే ఉన్న కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ దీనిపై దృష్టి సారించాలని కోరారు. గత ప్రభుత్వం వాహన మిత్ర పథకం ద్వారా 10 వేల రూపాయలు ప్రతీ ఏటా ఇచ్చేదని దాని వల్ల రవాణా కార్మికులకు బ్రేక్ ఇతర ఇబ్బందులు పరిష్కరించుకునేందుకు వీలు కలిగేదన్నారు. ఈ ప్రభుత్వం ద్వారా రవాణా కార్మికులను ఆర్థికంగా ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేసారు. జేఏసీ నేతృత్వంలో రాష్ట్రంలో, కేంద్రంలో కూడా అందర్నీ కూడగట్టుకుని ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు పోలుపల్లి నాగేశ్వరరావు, సప్పా ఆదినారాయణ, కాకినాడ కృష్ణ, జి.నరసింహారావు, లారీ యూనియన్ నాయకులు గోపాల్, రావు, తదితరులు పాల్గొన్నారు.

తెలుగురాష్ట్రం
దినపత్రిక

# ముంపు బాధితుల సమస్యలు పరిష్కరించండి



**ఎటపాక, జూలై 1(తెలుగు రాష్ట్రం విలేకరి):** మండల పరిధిలో ముంపు సమస్యలు పరిష్కరించాలని జడ్పిటిసి ఉబ్బ సుష్మిత, ఎంపీపీ కాక కామేశ్వరి, వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షులు ఆకుల వెంకట రామారావు( పెద్దోడు) కలిసి ఎమ్ఆర్ఓకి విజ్ఞప్తి చేశారు. రాబోయే వరదల సమస్య లపై బఫర్ స్టాక్ మరియు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలని, అలాగే ముంపు గురి అయ్యే గ్రామాలను గుర్తించి చుట్టూ నీళ్ల వచ్చిన గ్రామాల వరద బాధితుల ప్రజలకు కూడా సహాయ చేయాలని మరియు పశువుల దానా ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రామిరెడ్డి, రంపచోడవరం నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు దామర్ల రేవతి, కాకా వెంకట్, శీలం నాగేశ్వరరావు, తోట శివకుమార్, ఆకుల దయాకర్, కోడూరు నవీన్ కుమార్, చల్లమని, కొరకాసుల సూర్యప్రకాశరావు, మర్మం రాంబాబు, మాటూరి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మద్యంకు బానిసైన కొడుకును చంపిన తండ్రి



**జగ్గయ్యపేట, జులై 1 (తెలుగురాష్ట్రం విలేఖరి):** జగ్గయ్యపేట మండలంలోని షేర్ మహమ్మద్ పేట గ్రామంలో కొడుకు మద్యానికి బానిసై చిత్రహింసలు పెడుతున్నాడని తండ్రి చెక్కతో కొట్టి న యెడల అక్కడికక్కడే మృతి చెందిన కొడుకు. రాత్రి 10 గంటల సమయంలో బాగా మందు తాగి తన కొడుకు వికృత చేష్టలతో తండ్రి పై దాడి చేశాడని ఆ సందర్భంలో తండ్రి గోళ్ళకృష్ణ చెక్క మొద్దు తో కొడుకుని కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందడం జరిగింది. మృతుడు వెంకటనారాయణకు వివాహం జరిగి సుమారుగా 15 సంవత్సరాలు కాగా వారికి ఒక కుమారుడు ఒక కూతురు. ఐదు సంవత్సరాల క్రితం భర్తని వదిలేసి వెళ్లిపోయిన భార్య కృష్ణకుమారి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# గోతులన్నీ జలమయం

## -పట్టించుకోని ఆర్ అండ్ బి అధికారులు



**చింతలపూడి, జూలై 1 (తెలుగు రాష్ట్రం విలేకరి):** రోడ్డు మరమ్మత్తుల నాణ్యత ప్రమాణం పట్టించుకోని ఆర్ అండ్ బి అధికారులు. ఆరు నెలలు గడవకముందే, మళ్లీ మరమ్మత్తులకు వచ్చిన రోడ్లు.చింతలపూడి నగర పంచాయతీ తో పాటు మండలంలో రోడ్లన్నీ ఎక్కడ చూసినా గుంతల మయం గా మారాయి . వర్షాకాలం రావడంతో రోడ్ల పైన ఉన్న గుంతలలో ఎక్కడ చూసినా వర్షపు నీరు నిల్వ ఉండటంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్ అండ్ బి అధికారులు స్పందించాలని వాహన చోదకులు కోరుతున్నారు. మండలంలోని ప్రగడవరం నుంచి దేశవరం వరకు, ఒక గుంత కనిపించకపోయినా, మరమ్మతులు చేపట్టిన ఆర్ అండ్ బి అధికారులు.జీబిజి రోడ్ నుంచి రాఘవపురం వెళ్ల రోడ్డు ప్రమాదకరంగా గుంతలు మారిన, మరమ్మతులకు కూడా నోచుకోవటం లేదని తీవ్ర విమర్శలు ఉన్నాయి. కూటమీ ప్రభుత్వం వచ్చిన తర్వాత సంక్రాంతి నాటికి ఎక్కడ కూడా గుంతలు కనిపించకూడదని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన, ఆదేశాలు ఇక్కడ అధికారులు మాత్రం ఆదేశాలను అమలు చేయటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.ఇప్పుడు వర్షాకాలం రావడంతో, ప్రజలకు ఇబ్బందులు, గుంతలు పెద్దవిగా మారడంతో, ఇప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. వర్షం నీరు గుంతలలో నిండిపోయి, వాహనదారులకు గుంతలు కనిపించక, ప్రమాదాలు జరుగుతున్నాయి. జిల్లా అధికారులు దృష్టిపెట్టి, రోడ్లు మరమ్మత్తులు వెంటనే చేయించాలని, నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# బిజెపి నూతన అధ్యక్షుడిని అభినందించిన చింతలపూడి నేతలు



**చింతలపూడి, జూలై 1 (తెలుగు రాష్ట్రం విలేఖరి):** ఏపీ బీజేపీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన పివిఎన్ మాధవ్ ను విజయవాడలో కలిసి చింతలపూడి పట్టణ బిజెపి అధ్యక్షురాలు కొత్తపల్లి విజయ కుమారి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ మెంబర్ తోట వెంకటనారాయణ, బిజెపి నాయకులు తాటపర్తి శ్రీనివాసరావు, అనిల్ బొంకూరి తదితరులు పాల్గొన్నారు.

# రవాణా కార్మికుల భద్రతకు న్యాయస్థానమే శరణ్యమా!




**రాజమహేంద్రవరం, జూలై1 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** రవాణా వ్యవస్థ మనుగడకు పెనుముప్పుగా పరిణమించిన ఆటోమేటిక్ టెస్టింగ్ సిస్టం (ఏటీఎస్)ను రాష్ట్రప్రభుత్వం తక్షణం ఉపహరించాలని ఏపీ ట్యాక్సీ ఓనర్స్ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక రోడ్ మరియు రవాణా కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. అసోసియేషన్ సభ్యులు ఏవో ఎం సత్తిబాబుకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తమ అభ్యర్ధనను తెలియపరిచింది సాంకేతిక వాహనముల సామర్ధ్యాన్ని అంచనా వేయగల ప్రక్రియను నిర్వహించడానికి ఏటిఎస్ విధానం ఉపకరించకపోగా వాహనము యొక్క ఇంజన్ తదితర ముఖ్యమైన భాగములకు హాని జరుగుతున్నదని మోటార్ కార్మికులు అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు ముచ్చకర్ల సత్యనారాయణ మాట్లాడుతూ అనుభవపూర్వకంగా ఏటిఎస్ ప్రక్రియ విఫలమైనదన్న వాస్తవాన్ని ఇప్పటికీ పలు విధాలుగా రాష్ట్ర ప్రభుత్వం వారి దృష్టికి తీసుకు వెళ్ళినప్పటికీ ఎటువంటి స్పందన రాకపోవడంతో కార్మిక లోకం ఆందోళనకు గురవుతున్నదని తమ ఆవేదనను వ్యక్తపరిచారు. ప్రభుత్వ ఉదాసీనత కారణంగా రోడ్డు రవాణా వాహనములు మనుగడకు ముప్పు వాటిల్లుచున్న వదంతములు చోటు చేసుకుంటున్న వాస్తవాలను తీవ్రంగా పరిగణించాలని లేదంటే రోడ్డు రవాణా కార్మికులు బ్రతుకులు రోడ్డున పడే దుర్భర పరిస్థితులు ఏర్పడగలవని ఆయన వివరించారు. ఇతర రాష్ట్రాల్లోనూ ఈ ఏటీఎస్ విధానాన్ని వ్యతిరేకించాయి. కార్మికులు జీవించే హక్కుకి భంగకరంగా పరిణమించిన ఏటీఎస్ విధానాన్ని ఉపహరించకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సిన తప్పని పరిస్థితులు నెలకొని ఉన్నాయని ముచ్చకర్ల అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి దొమ్మేటి సోమ శంకర్, గోకవరం టాక్సీ స్టాండ్ అధ్యక్షులు మార్గాన వసంత కుమార్, దేముడు, వెన్న సత్యనారాయణ, నారాయణ కుమార్ నిడదవోలు టాక్సీ స్టాండ్ అధ్యక్ష కార్యదర్శులు బాలస్వామి, కురసాల రామకృష్ణ, కొవ్వూరు టాక్సీ స్టాండ్ అధ్యక్షులు శ్రీనివాస మునీంద్ర, కనకరాజు మండపేట టాక్సీ స్టాండ్ అధ్యక్ష కార్యదర్శులు గోమాడ శ్రీనివాస్, కేదార్ అనపర్తి ట్యాక్సీ స్టాండ్ అధ్యక్ష కార్యదర్శులు పితాని మాసరా, చింతాడ దుర్గారావు ద్వారపూడి రమణ, కోటిపల్లి బస్టాండ్ సప్ప అప్పారావు, బోరా శ్రీనివాస్ రెడ్డి, బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దకే పెన్షన్

**కళ్యాణదుర్గం, జూలై 1 (తెలుగురాష్ట్రం విలేఖరి)** ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పింఛన్ దారులు ఇబ్బంది పడకుండా ఉండాలని ఇంటి వద్దకే పింఛన్ల పంపిణీ చేస్తున్నారని, పింఛన్ పంపిణీ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఉదయం నుంచి పాల్గొని పింఛన్లు పంపిణీ చేస్తున్నారని ఎమ్మెల్యే సురేంద్రబాబు తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం కేవలం 1000 రూపాయలు పింఛన్ పెంచేందుకు ఐదు ఏళ్ల సమయం తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఏర్పడిన మొదటి నెలలోనే 4000 రూపాయల అందించి పింఛన్దారులకు భరోసా ఇచ్చారని తెలిపారు. రాష్ట్రంలో సాగునీటి పథకానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అందులో భాగంగానే హంద్రీనీవా కాలువ వెడల్పు కోసం నిధులు విడుదల చేసి పనులు కూడా వేగంగా చేపడుతున్నారని పేర్కొన్నారు. హంద్రీనీవా కాలవ వెడల్పు పనులు పూర్తీ అయితే మరింత ఎక్కువ నీళ్లు మన జిల్లాకు వస్తాయని ఆ నీటిని బీటీపీకి ఉపయోగించుకోవచ్చు అన్నారు. త్వరలోనే బీటీపీ పనులు ప్రారంభించి పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. మన ప్రాంతానికే అత్యవసరమైన పథకం బిటిపి అందుకు గత పాలకులు నిర్లక్ష్యం కారణంగా భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందించకుండా ఇబ్బందులకు గురి చేశారని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కాలువ కోసం భూములు ఇచ్చిన రైతులను పూర్తిస్థాయిలో గుర్తించి వారికి పరిహారం ఇచ్చిన వెంటనే పనులు ప్రారంభించి వీటిని ప్రాజెక్టుతో పాటు కుందుర్పి బ్రాంచ్ కెనాల్ కు నీళ్లు తీసుకువస్తామన్నారు.

# పింఛన్ల కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే చిర్రి



**జీలుగుమిల్లి, జులై1(తెలుగు రాష్ట్రం విలేఖరి):** జీలుగుమిల్లి మండలంలో మంగళవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ, ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రతినెల 1వ తేదీన క్రమం తప్పకుండా పింఛన్లు పంపిణీ చేస్తున్నామని స్పష్టం చేశారు. లబ్ధిదారులకు ఆర్థిక భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది లబ్ధిదారులకు పింఛన్లు నేరుగా వారి ఇంటి వద్దకే చేరుతున్నాయని తెలిపారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులు సహా పలు వర్గాల ప్రజలకు ఈ పథకం అండగా నిలుస్తోంది.ప్రభుత్వం సంక్షేమానికి కట్టుబడి ఉందని, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ పంపిణీ కార్యక్రమం ప్రభుత్వ పారదర్శకత, జవాబుదారీతనానికి నిదర్శనమని ఎమ్మెల్యే అన్నారు. లబ్ధిదారులు సకాలంలో పింఛన్లు అందుకోవడంపై సంతోషం వ్యక్తం చేశారు.

# బీజేపీ అధ్యక్షులు మాధవ్ కు అభినందనలు తెలిపిన మాధవి



**విజయవాడ, జూలై 1(తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా బాధ్యత స్వీకరించిన పివిఎన్ మాధవ్ కు పట్టణానికి చెందిన బీజేపీ నాయకురాలు కంబంపాటి మాధవి అభినందనలు తెలిపారు. రాష్ట్ర పార్టీ కార్యాలయం లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో మాధవ్ నాయకత్వంలో భారతీయ జనతా పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. యువనాయకత్వంలో నాయకత్వ నైపుణ్యాలు నిబద్ధత సంకల్పం అయనకు ఉన్నాయని ఆమె తెలియజేసారు.

# చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణంను త్వరితగతిన పూర్తి చెయ్యాలి



**చింతూరు, జులై1(తెలుగు రాష్ట్రం విలేకరి):** చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు తరగతి గదులు నిర్వహణ చేపట్టాలని నిర్మాణంలో ఉన్న డిగ్రీ కళాశాలను పరిశీలించిన గిరిజన సంఘం బృందం రాష్ట్ర కమిటీ సభ్యులు సీసం సురేష్ డిమాండ్ డిమాండ్ చేశారు మంగళవారం నాడు గిరిజన సంఘం జిల్లా బృందం చింతూరు కేంద్రంలో నిర్మాణంలో ఉన్న డిగ్రీ కళాశాల భవనాన్ని సందర్శించడం జరిగినది, ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ సభ్యులు సిసం సురేష్ మాట్లాడుతూ 8 ఏళ్ల క్రితం ఆనాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు ప్రారంభించగా నిర్మాణం అస్తవ్యస్తంగా అరకు కొరా నిధులు కేటాయింపుతో ప్రభుత్వాలు మారుతున్న నిర్మాణం పూర్తి కాకుండా నేటికీ అసంపూర్ణంగానే ఉందని నేటికీ గోడల నిర్మాణం స్లాబు మినహాయిస్తే ఇంకా ఏమి పనులు పూర్తి కాలేదని ఇంకా అనేక నిర్మాణ పనులు, విద్యుత్తు,పెయింటింగ్, టైల్స్, విద్యార్థులకు అవసరమైనటువంటి టాయిలెట్స్ కళాశాల ప్రహరీ ఏ పనులు కూడా చేపట్టలేదని నేటికీ నిర్మాణంలో ఉన్నకళాశాల మొత్తం అస్తవ్యస్తంగా అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా ఉందని గత ప్రభుత్వం ఐదేళ్ల కాలంగా నిర్మాణాన్ని దృష్టి పెట్టకపోవడం వల్ల నేటికీ విద్యార్థులు జూనియర్ కళాశాలలో ఒక్క పూట తరగతుల 8 ఏళ్లుగా నిర్వహణతో విద్యార్థుల విలువైన సమయాన్ని వృధా అయ్యిందని తక్షణమే కళాశాల నిర్మాణం పూర్తి చేయాలని అంతేకాకుండా కళాశాలకు అదనపు గదులు మరియు సైన్సు కంప్యూటర్ ల్యాబ్స్ కు సంబంధించినటువంటి అనేక భవన నిర్మాణాలను ప్రభుత్వం చేపట్టాల్సిన అవసరం ఉందని తక్షణమే ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి కారం నాగేష్, మొట్టమ్ రాజయ్య, ధర్మల వీరభద్రం, సోడే లెనిన్, షోడే రాజయ్య, పోచం వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

# వరదల బకాయి ఇప్పించండి సార్

## -ఐటీడీఏ పీవోకు కరుణ వినతి పత్రం



**వి.ఆర్. పురం, జూలై1 (తెలుగురాష్ట్రం విలేకరి) :** అల్లూరిసీతారామరాజు జిల్లా మండలంలో 2022లో శబరి గోదావరి నదుల వలన వచ్చిన వరదలకు విఆర్ పురం తహసీల్దార్ ఆదేశాల మేరకు వరదలకు వచ్చిన ఎన్డీఆర్ఎఫ్ బృందం ,ఫ్లడ్ డ్యూటీ సిబ్బందికి బొర్రా కరుణ ఆధ్వర్యంలో భోజనం, టీ, టిఫిన్, పెట్టడం జరిగిందనీ, వాటికి సంబంధించిన ఖర్చులు నిమిత్తం 5,16,601 రూపాయలు బిల్లు అయినదని అట్టి బిల్లులను పాడేరు కలెక్టర్ వారికి పంపించగా వారు మాకు వాటి నిమిత్తం 2022 లో లక్ష రూపాయలు మాత్రమే ఇవ్వడం జరిగిందని మిగిలిన సొమ్ములు ఇంతవరకు రాలేదని, రావలసిన సొమ్ములు 4, 16,601 రూపాయలు త్వరగా ఇప్పించాలని మంగళవారం చింతూరు ఐటిడిఏ పిఓ వారినీ కలసి వినతి పత్రం అందజేశామని కరుణ తెలిపారు.

# ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం,ఆశ్రమ పాఠశాలలు తనిఖీ



**దేవీపట్నం, జులై 1(తెలుగు రాష్ట్రం విలేకరి):** వివిధ రకాలైన యన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు ఎక్కడికక్కడ లబ్ధిదారులకు అందజేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం దేవీపట్నం మండలంలోని ఇందుకూరుపేట గ్రామంలో సామాజిక ఫించన్లు పంపిణీ కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారి పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏడు మండలాల్లోని వివిధ గ్రామాలలో సామాజిక పింఛన్లు పంచాయితీ సచివాలయాల సిబ్బందితో ఇండ్ల వద్దకు చేరే విధంగా ఉదయం నుండి ప్రారంభించడం జరిగిందని ఆయన తెలిపారు. సామాజిక పింఛన్లు సాధ్యమైనంతవరకు లబ్ధిదారులకు ఈరోజు అందజేయడం జరుగుతుందని ఆయన అన్నారు. అనంతరం ఇందుకూరుపేట గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రాజెక్ట్ అధికారి పరిశీలించడం జరిగింది. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారుల, సిబ్బంది ఎంతమంది ఉన్నది అదేవిధంగా ప్రతిరోజు అవుట్ పేషెంట్లు వచ్చుచున్నది. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఎంతమంది గర్భిణీ స్త్రీలు ఉన్నది ఆయన ఆరా తీశారు. సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో పెట్టాలని ఆయన అన్నారు. ఎవరైనా జ్వరములతో వచ్చిన వారిని వెంటనే రక్త నమూనాలు స్వీకరించి ఆయా వ్యాధులకు ఉచిత మందులు అందజేయాలని అదే విధంగా వైద్యాధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు వైద్య సేవలు అందించాలని ఆయన అన్నారు. అనంతరం కొత్తవీధి (ముసినికుంట) గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలను ప్రాజెక్ట్ అధికారి పరిశీలించారు. విద్యార్థులకు ఎవరైన సీజనల్ వ్యాధులతో బాధపడుతున్న ఎడల వెంటనే ఆసుపత్రికి తీసుకొని వెళ్లి మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతిరోజు మెనూ అమలు చేయాలని అదే విధంగా ప్రతిరోజు వేడివేడి ఆహార పదార్థాలు విద్యార్థులకు అందించాలని ఆయన అన్నారు. విద్యార్థులకు ప్రతిరోజు కాచి చల్లార్చిన త్రాగునీరు అందించాలన్నారు.విద్యార్థులందరికీ పుస్తకాలు,నోటు పుస్తకాలు అందరికీ అందినది లేనిది ప్రాజెక్ట్ అధికారి ఆరా తీశారు.పాలు,గుడ్లు, కూరగాయలు,నిత్యవసర సరుకులు ప్రతినెల వెండర్లు ఏవిధంగా సరఫరా చేయుచున్నది ఆయన ఆరా తీశారు.విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎంతమంది ఉన్నది ప్రాజెక్ట్ అధికారి ఆరా తీశారు.

# కాస్టీ బంతితో ప్రాక్టీస్..

## వైభవ్ భారీ సిక్స్‌ల సీక్రెట్ ఇదే..

**భారత అండర్-19 జట్టులో యువ సంచలనం, స్టార్ బ్యాట్స్ మెన్ వైభవ్ సూర్యవంశీ ఇప్పుడు ఇంగ్లాండ్ గడ్డపై తన బ్యాట్ తో అదరగొడుతున్నాడు. ఇంగ్లాండ్ పర్యటనకు ముందు బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీ లో జరిగిన ప్రాక్టీస్ మ్యాచ్ లో కేవలం 90 బంతుల్లో 190 పరుగులు చేసి అందరి దృష్టినీ ఆకర్షించాడు. అయితే, అతని ఈ విధ్వంసకర ప్రదర్శన వెనుక ఉన్న రహస్యాన్ని అతని చిన్ననాటి కోచ్ మనీష్ ఓఝా తాజాగా వెల్లడించారు.**



### డ్యూక్ బంతితో ప్రత్యేక శిక్షణ..

వైభవ్ సూర్యవంశీ ఇంగ్లాండ్‌లో ఆడుతున్న డ్యూక్ బంతితో ప్రత్యేకంగా ప్రాక్టీస్ చేశాడని కోచ్ మనీష్ ఓఝా తెలిపారు. ఈ బంతి ఇంగ్లాండ్ పిచ్ లలో బౌలర్లకు ఎక్కువ స్వింగ్, సీమ్ అందిస్తుంది. అందుకే, అక్కడి పరిస్థితులకు అలవాటు పడటానికి, డ్యూక్ బంతితో సాధన చేయడం చాలా అవసరం. ఈ డ్యూక్ బంతి ధర భారత మార్కెట్లో సుమారు 10,000 రూపాయలు ఉంటుందని కోచ్ వెల్లడించారు.

### పవర్ హిట్టింగ్‌పై దృష్టి..

వైభవ్ చిన్నప్పటి నుంచీ పవర్ హిట్టింగ్‌పై ప్రత్యేకంగా దృష్టి పెట్టాడు. కోచ్ ఓఝా, అతనికి ఫుల్ టాస్ బంతులను వేస్తూ, బ్యాట్‌ను పైకి లేపి, బంతిని సరిగ్గా టైమింగ్ చేస్తూ, వీలైనంత ఎక్కువ శక్తితో కొట్టేలా శిక్షణ ఇచ్చారు. కట్స్, పుల్స్, బ్యాక్-ఫుట్ పంచ్‌లు, లిఫ్ట్‌లు వంటి అన్ని షాట్లపైనా నిరంతరం సాధన చేయించాడు. యువరాజ్ సింగ్, సౌరవ్ గంగూలీ లాగా తన బ్యాక్ లిఫ్ట్, హ్యాండ్ ఎక్ స్ టెన్షన్‌పై కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టించాడు.

### ప్రతిరోజూ 350-400 బంతులు..

వైభవ్ సూర్యవంశీ ప్రతిరోజూ నెట్ లో 350-400 బంతులను ఎదుర్కొనేవాడు. బేసిక్ డ్రిల్స్, రోబో త్రోడౌన్స్, లైవ్ బౌలింగ్, ఫీల్డ్ ప్లేస్ మెంట్ ఛాలెంజ్‌లతో కూడిన క్రమబద్ధమైన శిక్షణ అతని బ్యాటింగ్ సామర్థ్యాన్ని పెంచింది. అతని బ్యాటింగ్‌లో కనిపించే ఆత్మవిశ్వాసం, బంతిని బౌండరీలు దాటించే నైపుణ్యం ఈ కఠినమైన శిక్షణ ఫలితమే అని కోచ్ అన్నారు.

### ఇంగ్లాండ్ పర్యటనలో అద్భుత ప్రదర్శన..

ఇంగ్లాండ్ అండర్-19 జట్టుతో జరిగిన మొదటి వన్డేలో వైభవ్ సూర్యవంశీ 19 బంతుల్లో 48 పరుగులు (5 సిక్సర్లతో సహా) చేసి, భారత జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. రెండో వన్డేలో కూడా 34 బంతుల్లో 45 పరుగులు (3 సిక్సర్లతో సహా) చేసి ఆకట్టుకున్నాడు. ఐపీఎల్ 2025లో రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడి, 35 బంతుల్లో సెంచరీ సాధించి రికార్డు సృష్టించిన వైభవ్, ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో కూడా తన సత్తా చాటుతున్నాడు.

వైభవ్ సూర్యవంశీకి వయసు తక్కువే అయినప్పటికీ, అతని కఠోర సాధన, అంకితభావం, కోచ్ మార్గదర్శకత్వం అతన్ని ఒక అద్భుతమైన క్రికెటర్‌గా తీర్చిదిద్దాయి. భవిష్యత్తులో భారత సీనియర్ జట్టులోకి అడుగుపెట్టే అవకాశం ఉందని అతని ప్రదర్శన స్పష్టం చేస్తోంది.

# కీపర్‌గా మొదలై, డేంజరస్ బ్యాటర్‌గా మారి..

## అంతే స్పీడ్‌గా ముగిసిన కెరీర్... 'గబ్బర్' ఆత్మకథలో సంచలన నిజాలు

**భారత క్రికెట్ అభిమానుల గుండెల్లో 'గబ్బర్'గా సుస్థిర స్థానం సంపాదించుకున్న డాషింగ్ ఓపెనర్ శిఖర్ ధావన్, తన తొలి ఆత్మకథ "ది వన్: క్రికెట్, మై లైఫ్ అండ్ మోర్" ను విడుదల చేశారు. క్రికెట్ కెరీర్‌లోని ఎత్తుపల్లాలు, వ్యక్తిగత జీవితంలోని ఒడిదుడుకులు, మానసిక పోరాటాలు, విజయాలు, ఓటములను అత్యంత నిజాయితీగా, నిర్మొహమాటంగా ఈ పుస్తకంలో వివరించారు. హార్పర్‌కాలిన్స్ ఇండియా ప్రచురించిన ఈ పుస్తకం, జూన్ 26, 2025న అధికారికంగా విడుదలైంది.**



"ప్రతి విజయం హైలైట్లలో కనిపించదు. ప్రతి ఓటమి స్కోర్ బోర్డులో కనిపించదు. 'ది వన్' అనేది వాటన్నిటి మధ్య ఉన్న కథ. నేర్చుకోవడం, మరచిపోవడం, ప్రతిసారీ నిలబడటం. ఇది నా హృదయం నుంచి వచ్చింది" అని ధావన్ తన ఆత్మకథ గురించి ఎమోషనల్‌గా ఇన్‌స్టాగ్రామ్ రీల్ ద్వారా ప్రకటించారు.

ఈ పుస్తకం కేవలం ధావన్ క్రికెట్ గణాంకాలు, సెంచరీలకు మాత్రమే పరిమితం కాదు. ఢిల్లీలో పెరిగి, భారత జెర్సీని ధరించాలనే కలలతో మొదలైన అతని ప్రయాణం, భారత వైట్-బాల్ క్రికెట్‌లో అత్యంత స్థిరమైన, విజయవంతమైన ఓపెనర్‌లలో ఒకరిగా మారిన తీరును ఇది వివరిస్తుంది. గాయాలు, ఫామ్ కోల్పోవడం, స్వీయ సందేహాలు, వ్యక్తిగత పునర్నిర్మాణాలు, నిశ్శబ్దంగా తిరిగి రావడం వంటి అతని అంతర్గత పోరాటాలను ఈ పుస్తకంలో లోతుగా చర్చించారు.

### వ్యక్తిగత జీవితం - నిజాయితీగా వెల్లడి..

'ది వన్' లో, ధావన్ తన వ్యక్తిగత సంబంధాలు, స్నేహాలు, మైదానంలో, వెలుపల తాను ఎదుర్కొన్న వివాదాలను కూడా నిర్భయంగా వెల్లడించారు. ముఖ్యంగా, 2006లో ఆస్ట్రేలియా పర్యటనలో ఒక విదేశీ అమ్మాయితో ప్రేమలో పడటం, దాని కారణంగా తన ఆటతీరు ఎలా ప్రభావితమైందో, అప్పటి రూమ్మేట్ రోహిత్ శర్మతో తలెత్తిన కొన్ని సంఘటనలను కూడా ధావన్ తన పుస్తకంలో వివరించారు. ఇది అభిమానులకు ఇప్పటివరకు తెలియని ధావన్ జీవితంలోని కోణాలను ఆవిష్కరిస్తుంది.

### ఒక ప్రేరణాత్మక కథనం..

ఈ ఆత్మకథ కేవలం ఒక క్రికెటర్ జీవిత కథ మాత్రమే కాదు. ఆత్మవిశ్వాసం, పట్టుదల, తిరస్కరణలను అధిగమించడం, వ్యక్తిగత ఎదుగుదలకు సంబంధించిన ఒక ప్రేరణాత్మక కథనం "ది వన్". ధావన్ ఒక వికెట్ కీపర్‌గా తన కెరీర్‌ను ప్రారంభించి, తరువాత ఒక దూకుడైన ఓపెనింగ్ బ్యాట్స్‌మన్‌గా ఎలా మారారో కూడా ఈ పుస్తకంలో వివరించారు. క్రికెట్ ప్రపంచంలో మీడియా ఒత్తిడి, సోషల్ మీడియా ప్రభావం గురించి కూడా ధావన్ తన అభిప్రాయాలను పంచుకున్నారు. శిఖర్ ధావన్ తన కెరీర్‌లో 34 టెస్టులు (2315 పరుగులు), 167 వన్డేలు (6793 పరుగులు), 68 టీ20 మ్యాచ్‌లు (1759 పరుగులు) ఆడారు. అతని అద్భుతమైన ప్రదర్శనలు, ముఖ్యంగా ఐసీసీ టోర్నమెంట్లలో, అతనికి 'మిస్టర్ ఐసీసీ' అనే పేరును తెచ్చిపెట్టాయి. క్రికెట్‌కు వీడ్కోలు పలికిన తరువాత, ధావన్ ఇప్పుడు తన జీవిత ప్రయాణాన్ని పుస్తక రూపంలో పంచుకోవడం ద్వారా తన వారసత్వాన్ని మరింత సుస్థిరం చేసుకుంటున్నారు. "ది వన్" ధావన్ అభిమానులకు, క్రికెట్ ప్రేమికులకు ఒక అద్భుతమైన పఠనానుభవాన్ని అందిస్తుందని ఆశించవచ్చు.

# తనపై వచ్చిన మీమ్స్‌పై మౌనం వీడిన కావ్య మారన్

**అభిమానులు ఎక్కువగా ఫాలో అయ్యే జట్లలో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఒకటి. ఈ టీమ్‌లో ట్రావిస్ హెడ్, పాట్ కమ్మిన్స్, హెన్రిచ్ క్లాసెన్ వంటి మేటి ఆటగాళు న్నారు. ఈ ఫ్రాంచైజీ సహ యజమాని కావ్యమారన్ ఐపీఎల్‌లో తమ జట్టు ఆడినప్పుడల్లా ఆటగాళ్లను ఉత్సాహపరుస్తూ తరచుగా స్టాండ్లలో కనిపిస్తారు. కొన్ని సందర్భాల్లో, ఆమె డ్రెస్సింగ్ రూమ్‌లో ఉత్సాహభరితమైన ప్రసంగాలు కూడా ఇస్తుంటారు. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో కూడా ఆమెపై ఎక్కువగా మీమ్స్ వస్తూ ఉంటాయి.**

క్రికెట్ మీద తనకున్న మక్కువ వల్లే తాను ఎక్కువగా కెమెరామెన్ దృష్టిలో పడుతుంటానని కావ్య మారన్ అంటున్నారు. ఇదే తనపై మీమ్స్ ఎక్కువగా రావడానికి కారణమై ఉంటుందని వివరించారు. 'సన్‌రైజర్స్ జట్టు హైదరాబాద్‌లో ఆడినప్పుడే కాదు, అహ్మదాబాద్, చెన్నై లాంటి ప్రాంతాలకు కూడా నేను టీమ్‌ను ఉత్సాహపరచడానికి వెళుతుంటాను. నేను ఎక్కడో చాలా దూరంలో కూర్చున్నా.. కెమెరామెన్ నా హావభావాలను బంధిస్తాడు. అందుకే అవి మీమ్స్‌గా మారుతున్నాయి' అని ఆమె ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు చివరిసారిగా 2016లో ఐపీఎల్ టైటిల్‌ను గెలుచుకోగలిగింది. 2018, 2024లో రెండుసార్లు మాత్రమే ఫైనల్‌కు చేరుకుంది. 2025 సీజన్‌లో ఆ జట్టు పేలవ ప్రదర్శన చేసింది.

# టీమిండియా ప్రాక్టీస్ సెషన్ నుంచి కీలక సంకేతాలు..

## ప్లేయింగ్ 11లో ఏకంగా 3 మార్పులు?



**ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి టెస్టులో ఓడిపోయిన తర్వాత బర్మింగ్‌హామ్‌లో భారత క్రికెట్ జట్టు తిరిగి పుంజుకోవాలని కోరుకుంటోంది. ఇందుకోసం, ప్లేయింగ్ ఎలెవెన్‌లో చాలా మార్పులు చూడొచ్చు అని తెలుస్తోంది. భారత్, ఇంగ్లాండ్ మధ్య రెండో టెస్ట్ జులై 2 నుంచి బర్మింగ్‌హామ్‌లో జరగనుంది. ఈ మ్యాచ్‌కు రెండు రోజుల ముందు జూన్ 30న టీం ఇండియా ప్రాక్టీస్ చేసింది. ఈ శిక్షణా సెషన్ నుంచి టీమిండియా ప్లేయింగ్ ఎలెవన్ చిత్రం కూడా స్పష్టమైంది. భారత్ ఇంకా తన జట్టును వెల్లడించనప్పటికీ, అనేక సూచనలు వెలుగులోకి వచ్చాయి.**

ఇంగ్లాండ్‌తో జరిగే రెండో టెస్ట్‌లో జస్‌ప్రీత్ బుమ్రా ఆడటంపై చాలా ఊహాగానాలు వచ్చాయి. కొంతమంది అతను ఆడాలని అన్నారు, మరికొందరు అతనికి విశ్రాంతి ఇవ్వడానికి అనుకూలంగా ఉన్నారు. శిక్షణా సెషన్ నుంచి వచ్చిన సూచనలు అతను రెండవ టెస్ట్‌కు దూరంగా ఉంటాడని సూచిస్తున్నాయి. అతనికి విశ్రాంతి ఇవ్వవచ్చు. అయితే, బుమ్రా ఆడటంపై నిర్ణయం చివరి క్షణం వరకు తీసుకుంటామని భారత అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డోస్చాట్ అన్నారు.

ఇంగ్లాండ్‌తో జరిగే బర్మింగ్‌హామ్ టెస్ట్ కోసం భారత ప్లేయింగ్ ఎలెవన్‌లో రెండు-మూడు మార్పులు చేయవచ్చు. బ్యాటింగ్ నుంచి బౌలింగ్ వరకు మార్పులు ఉండవచ్చు. జస్‌ప్రీత్ బుమ్రా అవుట్ అయ్యి అతని స్థానంలో ఎవరైనా వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది. అతని స్థానంలో టీం ఇండియా ఫాస్ట్ బౌలర్ ఆకాష్ దీప్‌ను ఎంచుకోవచ్చని చెబుతున్నారు. అతను ప్రాక్టీస్‌లో చాలా బౌలింగ్ చేశాడు. అతను బాగా బ్యాటింగ్ చేస్తాడు. అర్ష్‌దీప్ సింగ్ తన టెస్ట్ అరంగేట్రం కోసం వేచి ఉండాల్సి రావచ్చు.

భారత జట్టు ప్లేయింగ్ ఎలెవన్ నుంచి శార్దూల్ ఠాకూర్‌ను తొలగించే అవకాశం ఉంది. మొదటి టెస్ట్‌లో అతని ప్రదర్శన అంచనాలకు తగ్గట్టుగా లేదు. అతను 16 ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేశాడు. బ్యాటింగ్‌లో కూడా తన వంతు పాత్ర పోషించలేకపోయాడు. శార్దూల్ స్థానంలో టీమ్ ఇండియా యువ ఆల్ రౌండర్ నితీష్ కుమార్ రెడ్డిని చేర్చుకోవచ్చు. జూన్ 30న ప్రాక్టీస్‌లో అతను బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో చాలా కష్టపడ్డాడు.

రెండవ టెస్ట్‌లో యువ ఆటగాడు యశస్వి జైస్వాల్ వేరే ప్రదేశంలో ఫీల్డింగ్ చేస్తున్నట్లు కనిపించవచ్చు. అతన్ని స్లిప్ నుంచి తొలగించవచ్చు. బర్మింగ్‌హామ్ టెస్ట్‌కు ముందు, జైస్వాల్ స్లిప్ కార్డన్‌లో క్యాచింగ్ ప్రాక్టీస్ చేయలేదు. అతని స్థానంలో, నితీష్ రెడ్డి, సాయి సుదర్శన్ క్యాచింగ్ ప్రాక్టీస్ చేస్తున్నట్లు కనిపించారు. జైస్వాల్ క్లోజ్-ఇన్ ఫీల్డర్‌గా, స్పిన్‌ను ఎదుర్కోవడానికి లెగ్ స్లిప్‌గా ప్రాక్టీస్ చేశాడు.

ఒకవేళ భారత్ ఇద్దరు స్పిన్నర్లతో ఆడితే, ఆ బ్యాట్స్‌మెన్‌లలో ఒకరు బయటకు వెళ్లాల్సి రావచ్చు. అంటే సాయి సుదర్శన్ లేదా కరుణ్ నాయర్ బయటకు వెళ్లవచ్చు. ఈ ఇద్దరు తప్ప, మిగతా స్పెషలిస్ట్ బ్యాట్స్‌మెన్ అందరూ మొదటి టెస్ట్‌లో సెంచరీలు చేశారు. అలాంటి పరిస్థితిలో, సుదర్శన్ లేదా నాయర్ అవుట్ కావచ్చు.

బర్మింగ్‌హామ్ టెస్ట్‌లో భారత జట్టు ఇద్దరు స్పిన్నర్లతో ఆడవచ్చు. దీంతో కుల్దీప్ యాదవ్ ఆడటం ఖాయం అనిపిస్తుంది. అతన్ని %శ% ఫ్యాక్టర్‌గా ఎంపిక చేయవచ్చు. రెండవ స్పిన్నర్ పాత్ర కోసం రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ మధ్య పోటీ ఉంటుంది. అసిస్టెంట్ కోచ్ దస?టే ప్రకారం, ఇద్దరు స్పిన్నర్లు ఆడటం ఖాయం, కానీ ఇద్దరు ఎవరు ఆడాలనే దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు.

రెండో టెస్ట్ కోసం భారత ప్లేయింగ్ ఎలెవన్ ఎలా ఉండనుందో ఓసారి చూద్దాం. జస్‌ప్రీత్ బుమ్రా, శార్దూల్ ఠాకూర్, రవీంద్ర జడేజా/సాయి సుదర్శన్/కరుణ్ నాయర్ జట్టుకు అవకాశం ఉండకపోవచ్చు. ఆకాష్ దీప్, నితీష్ కుమార్ రెడ్డి, కుల్దీప్ యాదవ్, వాషింగ్టన్ సుందర్/జడేజా వారి స్థానంలో ఆడవచ్చు.

# ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్..

## అగ్రస్థానానికి చేరువలో స్మృతి మంధాన



**దుబాయ్:** టీమ్‌ఇండియా మహిళల క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన ఇటీవల ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి టీ20లో శతకం (112) బాదింది. దీంతో టీ20 కెరీర్‌లో అత్యుత్తమ రేటింగ్ పాయింట్ల (771)ను సాధించి అగ్రస్థానానికి చేరువైంది. మంధాన ఒక స్థానం మెరుగై మూడో ప్లేస్‌లో నిలవగా.. ఆస్ట్రేలియా బ్యాటర్ బెత్ మూనీ (794), విండీస్ క్రికెటర్ హేలీ మాథ్యూస్ (774) తొలి రెండు స్థానాల్లో కొనసాగుతున్నారు. షెఫాలీ వర్మ ఒక స్థానం మెరుగై 13వ స్థానంలో నిలవగా.. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 12వ స్థానంలో కొనసాగుతోంది. బౌలింగ్ ర్యాంకింగ్స్ విషయానికొస్తే దీప్తి శర్మ, రేణుకా సింగ్ ఒక్కో స్థానం దిగజారి వరుసగా మూడు, ఆరు స్థానాల్లో నిలిచారు. రాధా యాదవ్ 16వ స్థానంలో కొనసాగుతోంది.

ఇంగ్లాండ్‌తో మిగిలిన నాలుగు టీ20ల్లో రాణిస్తే మంధాన టాప్‌లోకి దూసుకెళ్లడం ఖాయం. ఇప్పటికే స్మృతి వన్డేల్లో నంబర్ వన్ బ్యాటర్‌గా ఉన్న సంగతి తెలిసిందే. ఇక, నాటింగ్‌హామ్‌లో ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి టీ20లో స్మృతి మంధాన శతకంతో చెలరేగింది. దీంతో భారత్ 210 పరుగుల భారీ స్కోరు చేయగా.. ఇంగ్లాండ్ 113 పరుగులకే కుప్పకూలింది. ఈ సెంచరీతో మూడు ఫార్మాట్లలో శతకాలు చేసిన తొలి భారత మహిళా బ్యాటర్‌గా మంధాన రికార్డు సృష్టించింది. ఇవాళ (జులై 1) బ్రిస్టల్‌లో ఇంగ్లాండ్, భారత్ మధ్య రెండో టీ20 జరగనుంది.

తెలుగురాష్ట్రం దినపత్రిక






మానుషి చిల్లర్

# నయన్ చేజారిన బిగ్ ఆఫర్, 10 ఏళ్లకు రిపీట్..!

లేడీ సూపర్ స్టార్ నయనతార ప్రస్తుతం కోలీవుడ్‌లో అత్యధిక పారితోషికం తీసుకుంటున్న హీరోయిన్‌గా నిలిచింది. లేడీ ఓరియంటెడ్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఈమె నిలిచింది. తక్కువ సమయంలోనే ఎక్కువ సినిమాలు చేస్తూ బాక్సాఫీస్ వద్ద వందల కోట్ల వసూళ్లు సాధిస్తున్న ఈమె అప్పుడప్పుడు హీరోలకు జోడీగా కూడా సినిమాలు చేస్తున్న విషయం తెల్సిందే. హీరోయిన్‌గా సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న నయనతార ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవికి జోడీగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో సినిమాను చేస్తున్న విషయం తెల్సిందే. 2026 సంక్రాంతికి విడుదల కాబోతున్న ఆ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. నయనతార కెరీర్‌లో చాలా ఆఫర్లను కోల్పోవాల్సి వచ్చిందట. 2013లో షారుఖ్ ఖాన్‌తో కలిసి 'చెన్నై ఎక్స్‌ప్రెస్' సినిమాలో నటించే అవకాశం వచ్చింది. కానీ ఆ సమయంలో వ్యక్తిగత విషయాల కారణంగా నయనతార తీవ్రమైన ఒత్తిడిలో ఉంది. ఒకానొక సమయంలో నయనతార సినిమాలు మానేయాలని అనుకుంది. ఆ సమయంలో షారుఖ్ ఖాన్ మూవీ అయినప్పటికీ చెన్నై ఎక్స్‌ప్రెస్ సినిమాకు నో చెప్పింది. నయనతార నో చెప్పడంతో దీపికా పదుకునే ఆ సినిమాలో నటించింది. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద ఏకంగా రూ. 400 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. చాలా కాలం పాటు నయనతార చాలా దురదృష్టవంతురాలు, ఆ సినిమాను వదులుకోవడం అనేది ఆమె కెరీర్‌లో బిగ్ మిస్టేక్ అంటూ చాలా మంది చాలా రకాలుగా విమర్శలు చేశారు. కట్ చేస్తే సరిగ్గా పదేళ్లకు అంటే 2023లో అదే షారుఖ్ ఖాన్‌తో జవాన్ సినిమాను చేసింది. జవాన్ సినిమా ఏకంగా రూ. 1000 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. నయనతార ఆ సమయంలో చెన్నై ఎక్స్‌ప్రెస్ మూవీని వదిలేయడం వల్లే పదేళ్లకు రిపీట్ అయ్యి జవాన్ ఆఫర్ దక్కింది. అట్లీ దర్శకత్వంలో రూపొందిన జవాన్ సినిమాతో నయనతార బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చింది. చెన్నై ఎక్స్‌ప్రెస్ సినిమాతో బాలీవుడ్‌లో నయనతార ఎంట్రీ ఇచ్చినా పెద్దగా ప్రయోజనం ఉండక పోయేది. అదే సమయంలో నయనతారకు కోలీవుడ్‌లో ఆఫర్లు తగ్గేవి. ఆ సమయంలో నయనతార ఆ ఆఫర్‌ను ఏ పరిస్థితుల వల్ల వదులుకున్నా మంచే జరిగిందని ఇప్పుడు విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. నయనతార ఇంకా కొన్ని సినిమాలను ప్రమోషన్స్‌కు హాజరు అయ్యేందుకు తిరస్కరించడం వల్ల చేజార్చుకుంది. ఆ సినిమాల్లో కొన్ని సూపర్ హిట్ కాగా కొన్ని నిరాశను మిగిల్చాయి. ఇక లేడీ ఓరియంటెడ్ కథలు కూడా కొన్ని నయనతార వద్దకు మొదట వెళ్లాయి. ఏవో కారణాల వల్ల నయనతార వాటిని సున్నితంగా తిరస్కరిస్తూ వచ్చింది. వాటిల్లోనూ కొన్ని సూపర్ హిట్ అయ్యాయి. నటీ నటులు తమకు వచ్చిన అన్ని ఆఫర్లను చేయడం సాధ్యం కాదు. కానీ వారికి లక్ ఉంటే ఒక సమయంలో మిస్ అయిన ఛాన్స్ కచ్చితంగా మరో సమయంలో దక్కుతుంది. అలా ఇండస్ట్రీలో చాలా మందికి లక్ కలిసి వచ్చి మిస్ అయిన ఆఫర్లు వచ్చాయి. అయితే నయనతారకు మాత్రం పదేళ్లకు ముందు మిస్ అయిన షారుఖ్ మూవీ ఆఫర్ పదేళ్ల తర్వాత దక్కింది. అది కూడా బ్లాక్ బస్టర్ హిట్ కావడం ఆమె లక్‌ను చూపిస్తుంది. పెళ్లి తర్వాత కూడా నయన్ చాలా బిజీగా సినిమాలు చేస్తుంది. ముందు ముందు ఆమె నుంచి మరిన్ని తెలుగు, తమిళ సినిమాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

# యంగ్ హీరో కోసం విదేశీ స్టంట్ మాస్టర్లు!

యంగ్ హీరో తేజ సజ్జా కథాయాకుడిగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో భారీ పీరియాడిక్ చిత్రం 'మిరాయ్' తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే రిలీజ్ అయిన ప్రచార చిత్రాలతో అంచనాలు భారీగా ఏర్ప డ్డాయి. హనుమాన్ తర్వాత తేజ పాన్ ఇండియాలో మరో బ్లాసర్ట్ కొడతాడనే అంచనాలు రెట్టింపు అవుతు న్నాయి. చెడు కారణంగా మంచి తనానికి ముప్పు వాటిల్లినప్పుడు దారి చూపించే ఓ ఆయుధం పుడుతుంది. యుగాల క్రితం అవరించిన ఓ ఆ ఆయుధమే మిరాయ్ కాన్సెప్ట్ గా తెరకెక్కుతోంది. ప్రస్తుతం ఈ సినిమా షఉటింగ్ రామోజీ ఫిలిం సిటీలో జరుగుతోంది. తేజ సజ్జాపై కీలకమైన యాక్షణ్ సన్నివేశాలను చిత్రీక రిస్తున్నారు. దీనిలో బాగంగా టాలీవుడ్-హాలీవుడ్ స్టంట్ మాస్టర్లు కలిసి పనిచేస్తున్నారు. నభాకాంత్, రాబిన్ సుబ్బుతో పాటు విదేశీ స్టంట్ మాస్టర్ల ఆధ్యర్యంలో ఈ భారీ యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఇందులో కొన్ని సాహసోపేతమన సన్నివేశాల విషయంలోనే తేజ ఎక్కడా వెనక్కి తగ్గకుండా పాల్గొంటు న్నాడు. ఈ ఫైట్ సీన్ కోసం స్టంట్ మాస్టర్ల ఆధ్వర్యంలో కొంత ముందస్తు శిక్షణ కూడా తీసుకున్నాడుట. ట్రైనింగ్ అనంతరమే ఆ సన్నివేశాలు పూర్తి చేస్తున్నాడు. బాడీ లుక్ పరంగానూ తేజ మార్పులు తీసుకొ చ్చాడు. మునుపటి చిత్రం కంటే కాస్త బరువు పెరిగి మళ్లీ స్లిమ్ లుక్ లోకి మారాడు. తేజకు విలన్ గా మంచు మనోజ్ నటిస్తున్నాడు. సినిమాలో ఈ పాత్ర కూడా చాలా బలంగా ఉంటుందని ప్రచార చిత్రాలతో అర్దమవుతుంది. ప్రతి నాయకుడి ఆహార్యంలో మనోజ్ పర్ఫెక్ట్ గా సెట్ అయ్యాడు. హీరో ను మంచిని ఎలివేషన్ మిరాయ్ రూపంలో మనోజ్ కు దక్కుతుంది. విలన్ గా సక్సెస్ అయితే మనోజ్ కెరీర్ కొత్త టర్నింగ్ తీసుకున్నట్లే.



# ఢిల్లీకి తంగంతో వెళ్లనున్న పెద్ది

రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందుతున్న 'పెద్ది' సినిమా షఉటింగ్ జెట్ స్పీడ్‌తో సాగుతోంది. వచ్చే ఏడాది సమ్మర్‌కి కదా సినిమాను విడుదల చేసేది అని తాపీగా బుచ్చిబాబు షఉటింగ్ చేయడం లేదు. చాలా స్పీడ్‌గా సినిమాను పూర్తి చేసేందుకు బ్యాక్ టు బ్యాక్ షెడ్యూల్స్‌ను ప్లాన్ చేస్తున్నాడు. ఇప్పటికే కీలక సన్నివేశాల చిత్రీకరణ పూర్తి అయింది. మరో వైపు భారీ యాక్షన్ ఎపిసోడ్స్, పాటల చిత్రీకరణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అన్ని అనుకున్నట్లుగా జరిగితే అక్టోబర్ లేదా నవంబర్ వరకు సినిమా షఉటింగ్ మొత్తం పూర్తి చేయాలని బుచ్చిబాబు ప్లాన్ చేస్తున్నాడట. త్వరలో మరో షెడ్యూల్‌కి బుచ్చిబాబు ప్లాన్ చేశాడని చిత్ర యూనిట్ సభ్యుల ద్వారా సమాచారం అందుతోంది. 'పెద్ది' సినిమాకు సంబంధించిన కొత్త షెడ్యూల్‌ను జులై 12 నుంచి ఢిల్లీలో ప్లాన్ చేస్తున్నారు. అందుకోసం చిత్ర యూనిట్ సభ్యులు ఇప్పటికే అక్కడికి వెళ్లి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. అక్కడ దాదాపు వారం నుంచి పది రోజుల పాటు షఉటింగ్ ఉండనుందట. రామ్ చరణ్, జాన్వీ కపూర్‌లపై రొమాంటిక్ సీన్స్ షఉటింగ్ జరపనున్నారని తెలుస్తోంది. అతి త్వరలోనే పెద్ది సినిమా నుంచి కీలక అప్‌డేట్ రాబోతుంది. అందులో రామ్ చరణ్, జాన్వీ కపూర్‌లు ఉంటారనే వార్తలు కూడా వస్తున్నాయి. మొత్తానికి ఢిల్లీ షెడ్యూల్‌లో రామ్ చరణ్, జాన్వీ కపూర్‌ల కాంబో రొమాంటిక్ సీన్‌లు షఉట్ చేసిన తర్వాత ఒక పాట చిత్రీకరణ కూడా ఉండబోతుందట. ఎన్టీఆర్‌తో కలిసి దేవర సినిమాలో నటించిన జాన్వీ కపూర్ ఆ వెంటనే రామ్ చరణ్ పెద్ది సినిమాలో ఛాన్స్ దక్కించుకుంది. దేవర సినిమాలో తంగం పాత్రలో నటించడం ద్వారా టాలీవుడ్‌కి పరిచయం అయింది. ఆ సినిమాలో నటనకు పెద్దగా స్కోప్ దక్కలేదు. కేవలం గ్లామర్ షో కి మాత్రమే జాన్వీ కపూర్ పరిమితం అయింది. కానీ పెద్ది సినిమాలో అలా ఉండదని తెలుస్తోంది. కచ్చితంగా దర్శకుడు బుచ్చిబాబు ఈ సినిమాలో జాన్వీ కపూర్ పాత్రకు సరైన వెయిట్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. తన గత చిత్రం ఉప్పెనలో హీరోయిన్ పాత్రకు ఉన్న ప్రాముఖ్యత ఏంటో తెలిసిందే. అందుకే ఈ సినిమాలోనూ హీరోయిన్ పాత్రకు ప్రాధాన్యత ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. మెగా కాంపౌండ్ నుండి అందుతున్న సమాచారం ప్రకారం పెద్ది సినిమా షఉటింగ్ ఢిల్లీ షెడ్యూల్ తర్వాత మరో రెండు షెడ్యూల్స్‌లో పూర్తి చేయనున్నట్లు సమాచారం అందుతోంది. సినిమాలో రామ్ చరణ్ క్రీడాకారుడిగా కనిపించబోతున్నాడు. సాధారణంగా స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్ మూవీ అంటే ఒకే గేమ్ ఉంటుంది. కానీ ఈ సినిమాలో చాలా గేమ్స్‌ను ప్రేక్షకులు చూడబోతున్నారు. భారీ పాన్ ఇండియా మూవీగా రూపొందుతున్న ఈ సినిమాలో కన్నడ సూపర్ స్టార్ శివరాజ్ కుమార్ నటిస్తున్న విషయం తెల్సిందే. ఆయన క్యాన్సర్‌ను జయించి ఈ సినిమా షఉటింగ్‌లో పాల్గొన్నాడు. మరో షెడ్యూల్‌లోనూ ఆయన నటించే అవకాశాలు ఉన్నాయి. ఏఆర్ రెహమాన్ అందిస్తున్న సంగీతం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచే అవకాశాలు ఉన్నాయి.



# తారక్- హృతిక్ మధ్య అసలైన వార్ నేటి నుంచే!

'వార్ -2' లో హృతిక్ రోషన్- యంగ్ టైగర్ ఎన్టీఆర్ మధ్య నాటు నాటు రేంజ్ ఓ భారీ సాంగ్ ప్లాన్ చేసిన సంగతి తెలిసిందే. ఇద్దరు మంచి డాన్సర్లు కావడంతో పాటలో ఇద్దరి మధ్య పోటీ తగ్గాఫ్ వార్ గా ఉంటుం ది. సినిమా ఎలా ఉన్నా? ఈ ఒక్క పాట పీక్స్ లో ఉంటుంది? అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆ పాట కోసం థియేటర్ కు వె ళ్లే అభిమానులెంతో మంది. ఇద్దరి మధ్య ఆ ఇమేజ్ ను గుర్తించే మేకర్స్ ఇలా ప్లాన్ చేసారు. ఈ పాట కోసం ఇద్దరు అదే రేంజ్ లో శ్రమించారు. కొన్ని రోజుల పాటు యశ్ రాజ్ స్టూడియోలో రిహార్సల్స్ కూడా జరిగాయి. స్టెప్స్ ఎక్కడా నాన్ సింక్ కాకుండా ఈ రిహార్సల్స్ జరిగాయి. అంతా పర్ఫెక్షన్ తో నేడు కెమెరా ముందుకెళ్లారు. ఈ పాట కు సంబంధించిన షఉట్ మంగళవారం మొదలైంది. ఇద్దరి మధ్య సాంగ్ కాబట్టి పూర్తి చేయడానికి వారం రోజులైనా సమయం పడుతుంది. అప్పట్లో నాటు నాటు పాటకు కూడా కొరియోగ్రాఫర్లు ఎక్కువగానే సమయం తీసుకున్నారు. మరి తారక్-హృతిక్ పాటకు ఎవరు కంపోజ్ చేస్తున్నారు? అన్నది తెలియాలి. ఈ విషయాన్ని మేకర్స్ గోప్యం గా ఉంచారు. ఈ చిత్రానికి ముగ్గురు సంగీత దర్శకులు పనిచేస్తున్నారు. ప్రీతమ్-సంచిత్ బల్హోత్రా-అకింత్ బల్హోత్రా త్రయం సంగీతం సమకూ ర్చుతున్నారు. బాలీవుడ్ లో ముగ్గురు ఫేమస్ మ్యూజిక్ డైరెక్టర్లు. ఇప్పటికే ఎన్నో మ్యూజికల్ హిట్స్ అందించారు. మరి వార్ -2 లో ఈ స్పెషల్ సాంగ్ కి ఎలాంటి సంగీతం అందించారో చూడాలి. ఇప్పటికే ఈ చిత్రం టాకీ పార్ట్ పూర్తయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తారక్ డ్రాగన్ షఉటింగ్ మొదలు పెట్టాడు. మళ్లీ పాట చిత్రీకరణ నేపథ్యంలో కొన్ని రోజుల పాటు ముంబైలో ఉంటాడు. అనంతరం డబ్బింగ్ పనులు కూడా పూర్తి చేయాల్సి ఉంటుంది. తానే స్వయంగా డబ్బింగ్ చెప్పే అవకాశం ఉంది. తారక్ కి హిందీ బాగా వచ్చిన నటుడు. ఈ చిత్రాన్ని ఆగస్టు 14న రిలీజ్ చేస్తోన్న సంగతి తెలిసిందే.



TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339